


# జై వాసవి..జై జై వాసవి





వాసవీ మాతను దర్శించుకుంటున్న సీఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల



వాసవీ ధామ్ ప్రాంగణంలో మెడిటేషన్ సెంటర్ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు



ఆలయం వద్ద మహిళలకు నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబు

## సీఎం చంద్రబాబు పర్యటనలో అమ్మ వారి నామస్మరణ

- వాసవీ మాతకు పట్టు వస్త్రాల సమర్పణ
- అధికారికంగా అమ్మ వారి ఆత్మార్పణ దినం
- శాస్త్రోక్తంగా పూజలు.. పులకించిన భక్తజనం
- ధామ్ విస్తరణకు చంద్రబాబు శంకుస్థాపన

పెనుగొండ/ఆచంట/భీమవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వాసవీ మాత ఆత్మార్పణ రోజును రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి అధికారికంగా నిర్వహించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చారు. వాసవీ మాత ఆత్మబలిదానం రోజైన శుక్రవారం పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసుర మర్దిని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం, వాసవీ ధామ్‌లలో సీఎం రెండు గంటలపాటు గడిపారు. వాసవీ మాతకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆర్య వైశ్య మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున చంద్రబాబును స్వాగతించారు. జై వాసవి.. జైజై వాసవి అంటూ మహిళలు నినదించారు. అనుకున్న సమయంకంటే చంద్రబాబు గంట ఆలస్యంగా పెనుగొండ చేరుకున్నారు. సీఎం రాక కోసం పెనుగొండ ఏఎంసీలో హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం 11.53 గంటలకు విజయవాడ నుంచి హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంఎల్ఎలు పితాని సత్యనారాయణ, పులపర్తి అంజిబాబు, బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఇన్‌చార్జ్‌లు వలవల బాబ్జి, పొత్తూరి రామరాజు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం కాన్వాయ్‌లో నగరేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. పాస్‌లు ఉన్న వారికే ఆలయ ప్రాంగణంలోకి అనుమతి ఇచ్చారు. ఆలయం వద్ద ఆర్య వైశ్య పెద్దలు, అధికారులు చంద్రబాబుకు స్వాగతం పలికారు. గుడి చుట్టూ ఆయన ప్రదక్షిణలు చేశారు. ఆ తర్వాత వేద పండితులు చంద్రబాబుకు తలపాగా చుట్టారు. సంప్రదాయ వస్త్రాలతో విచ్చేసిన సీఎం అమ్మవారికి పట్టు వస్త్రాలు అందజేశారు. వేద పండితులు వాసవీ మాతకు పూజలు నిర్వహించారు. అనంతరం సీఎంకు వేదాశీర్వాదం అందించారు.

### వాసవీ నామస్మరణ..

ఆలయం నుంచి బయటకు వచ్చిన చంద్రబాబు బారులు తీరిన మహిళల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలుకరించారు. అక్కడనుంచి వాసవీధామ్‌కు వెళ్లారు. ధామ్ వద్ద ట్రస్ట్ సభ్యులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు. అనంతరం ధామ్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ట్రస్ట్ ప్రతినిధులు విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి అక్కడ భక్తులను ఉద్దేశించి ప్రసగించారు. ఈ ఆలయం భవిష్యత్తులో మరింత ఔన్నత్యాన్ని పొందుతుందంటూ పేర్కొన్నారు. వాసవీ మాత త్యాగ నిరతిని, చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. అనంతరం వాహనాంలో హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ కల్లుగీత వృత్తి సంఘాల సభ్యులు చేరుకుని చంద్రబాబుకు వినతి పత్రం సమర్పించారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వాసవీ ధామ్‌లో అమ్మవారి నిలువెత్తు విగ్రహం వద్ద సీఎం చంద్రబాబు.. చిత్రంలో మంత్రులు నిమ్మల, టీజీ భరత్, ఎమ్మెల్యేలు ఆరిమిల్లి, పితాని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు రామరాజు, మాజీ మంత్రి సుజాత, మాజీ ఎమ్మెల్సీ అంగర, వాసవి శాంతి ధామ్ అధ్యక్షుడు గోవిందరాజు, సెక్రటరీ రాజా

## నేడు, రేపు ఇంటర్ క్వాలిఫయింగ్ పరీక్షలు

ఏలూరు అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా ఫిబ్రవరి 1న ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, 3న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలను జిల్లాలో 137 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు ఇంటర్‌బోర్డు ఆర్ఐవో చంద్రశేఖరబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్వాలిఫయింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తేనే ఇంటర్ పాస్ సర్టిఫికెట్ ఇస్తారన్నారు. ఈ పరీక్షలకు జిల్లాలో 18,453 మంది విద్యార్థులు వారు చదువుకుంటున్న కళాశాలల్లోనే హాజరు కావాల్సి ఉంటుందన్నారు. గతంలో ఇంటర్ చదివి, ఏదైనా కారణాలతో ఈ క్వాలిఫైయింగ్ పరీక్షలు రాయని లేదా ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు ఇంతకుముందు రాసిన పరీక్షల హాల్‌టిక్కెట్ నెంబరుతో హాజరు కావొచ్చన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు నోడల్ అధికారుల నియామకం

ఏలూరు,జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు- పశ్చిమ గోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల మోడల్ కోడ్ అమల్లోకి వచ్చిన కారణంగా ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు లాఅండ్ ఆర్డర్, జిల్లా భద్రతా ప్రణాళిక (జిల్లా ఎస్పీ), మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు, బ్యాలెట్ బాక్సులు (జడ్పీసీఈవో), ఫస్ట్ ఎయిడ్ సెంటర్స్ (డీఎంహెచ్‌వో), ఎన్నికల సిబ్బంది నియామకానికి వివరాలు (డీఈవో), ఎన్నికల శిక్షణా కార్యక్రమాల నిర్వహణ(జడ్పీ డిప్యూటీ సీఈవో, డ్వామా పీడీ), రవాణా నిర్వహణ(డీటీసీ), ర్యాండమైజేషన్ వెబ్‌కాస్టింగ్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ సంబంధిత అంశాలు (డిస్ట్రిక్ ఇన్ఫర్మెటిక్ ఆఫీసర్), రిపోర్టులు (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సివిల్ సప్లయ్స్), పోస్టల్ బ్యాలెట్ పేపర్స్ (ఎస్సీ కార్పొరేషన్ ఈడీ), బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ (ట్రైబల్ వెల్ఫేర్ ఎస్డీసీ), ఓటర్ల జాబితా (డీఆర్వో), ఎన్నికల పరిశీలకుల ఏర్పాట్లు (జిల్లా ఎక్సైజ్ అధికారి, ఏలూరు ఆర్డీవో), పోలింగ్ సిబ్బంది, వెల్ఫేర్ మేనేజ్‌మెంట్ (జిల్లా సివిల్ సప్లయ్స్ మేనేజర్), వసతుల కల్పన (పంచాయతీరాజ్ ఎస్ఈ), కాల్ సెంటర్, ఫిర్యాదు పరిష్కారం (జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి), హెల్ప్‌డెస్క్ (వయోజన విద్యాశాఖ డీడీ)లకు బాధ్యతలను అప్పగించారు. ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ ఫిబ్రవరి 10 వరకు తుది గడువు కాగా, ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ, 27న పోలింగ్, మార్చి 3న ఎన్నికల ఓట్ల లెక్కింపును చేపట్టనున్నట్టు కలెక్టర్ తెలిపారు.

## ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి..

ఏలూరు అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మరింతమెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంలో భాగంగా ఇకనుంచి వైద్యులు, వైద్యసిబ్బంది ముఖ గుర్తింపు ఆధారిత (ఎఫ్ఆర్ఎస్) హాజరును పరిశీలిస్తామని, ఆయా ఆస్పత్రుల్లో వైద్యసిబ్బంది అంతా ఖచ్చితంగా అందుబాటులో ఉండాల్సిందేనని కలెక్టర్ వెట్రిసెల్వి స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గర్భిణుల నమోదు, ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే, వెక్టార్‌బోర్న్ వ్యాధుల నివారణ, ఎన్టీఆర్ వైద్యసేవ, ఇమ్యునైజేషన్, కుష్ఠువ్యాధి నివారణ తదితర అంశాలపై జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యాధికారులకు దిశానిర్దేశం చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌సతీష్, ఎన్టీఆర్ వైద్యసేవల జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు

# అసలేం జరిగింది ?

## తణుకు రూరల్ ఎస్ఐ మూర్తి మరణంపై భిన్న వాదనలు

### ఆత్మహత్య చేసుకున్నాడు

- సోదరుడు, సోదరి ఆరోపణ

'చిన్నప్పటి నుంచి అనుకున్నది సాధించాలనే పట్టుదల ఉన్న వ్యక్తిత్వం తనది. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలో వున్న మూర్తిని, ఏలూరు రేంజిలో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు చెప్పారు. దీంతో ఎక్కడ తనకు దూరంగా పోస్టు వస్తుందోనని భావించాడు. జరిగిన దానిని వదిలేయ్ మళ్లీ ఉద్యోగం వస్తుంది. ధైర్యంగా ఉండు. లేదంటే ఉద్యోగం వదిలేసి వచ్చేయమని చెప్పాం. ఉదయం స్టేషన్‌కు వెళ్లిన కొద్దిసేపటికే రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోయాడు. పోలీసులు, మీడియా తీరు వల్లే ఇలా జరిగింది. సంబంధం లేని విషయాన్ని పెద్దభూతంలా చేశారు. ఇప్పుడు మనిషే పోయాడని సోదరుడు వెంకటేశ్, సోదరి శ్రీలక్ష్మి కన్నీరు మున్నీరుగా విలపించారు. 'మూర్తి ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు. అతని ఫోన్ కాల్ లిస్టు బయటపెట్టాలి. అతని మృతిపై అనుమానాలు ఉన్నాయి. అధికారుల వేధింపులు ఉన్నాయా ? అనే విషయం తేలాలి. సెల్‌ఫోన్, వీడియోలు బయటపెట్టాలి' అని ఆయన స్నేహితుడు కె.గంగవరానికి చెందిన వెంకటరమణ డిమాండ్ చేశారు.

తణుకు/కె.గంగవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వీఆర్‌లో వున్న తణుకు రూరల్ ఎస్ఐ ఏజీఎస్ మూర్తి(38) మృతిపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మూర్తి ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు, బ్యాచ్‌మేట్స్, కుటుంబ సభ్యులు ఆరోపిస్తుంటే.. కాదు గన్‌మిస్ ఫైర్ అయ్యిందని జిల్లా ఎస్పీ నయీం అస్మి చెబుతున్నారు. కుటుంబ సభ్యులు, సహోద్యోగుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరానికి చెందిన ఆదుర్తి గోపాలరావు, తల్లి సూర్యావతిలకు ఇద్దరు కుమారులు వెంకటేశ్, మూర్తి, కుమార్తె శ్రీలక్ష్మి. మూర్తి టెన్త్ వరకు స్వగ్రామంలోనే చదివాడు. ఎంతో కష్టపడి 2012లో ఎస్ఐ ఉద్యోగం సాధించాడు. విజయలక్ష్మితో వివాహం కావడంతో వీరికి కుమారుడు చందన్(5) కుమార్తె హేమాన్షి (16 నెలలు) ఉన్నారు. పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని మచిలీపట్నం, కైకలూరు, భీమవరం టూ టౌన్, పాలకోడేరు, పెరవలి, నరసాపురం రూరల్, ఆచంట, తణుకు రూరల్ స్టేషన్‌లలో పనిచేశాడు. వేల్పూరులో రెండు గేదెల అపహరణ కేసులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో నాలుగు నెలలు క్రితం పోలీసు ఉన్నతాధికారులు వీఆర్‌లో పెట్టారు. అప్పటి నుంచి తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. తనకు సంబంధం లేని కేసులో వీఆర్‌కు పంపారని అవమానంగా భావించాడు. పెనుగొండలో సీఎం పర్యటనకు బందోబస్తుగా వెళ్లాలని ఆదేశాలు రావడంతో.. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు తణుకు రూరల్ పోలీసుస్టేషన్‌కు బైక్‌పై వచ్చాడు. కొంతసేపటికి సర్వీసు రివాల్వర్ తీసుకుని పక్కనే ఉన్న వాష్ రూమ్‌కు వెళ్లి కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ విషయం తెలియగానే ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన 2012 బ్యాచ్ ఎస్ఐలు పెద్ద ఎత్తున తణుకు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. అందరికి ధైర్యం చెప్పే మూర్తి ఇలా ఎందుకు చేశాడోనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన పోలీసు శాఖలో కలకలం రేగింది. ఉన్నతాధికారుల నుంచి రకరకాల ఒత్తిళ్ల సిబ్బందిని కుంగిపోయేలా చేస్తున్నాయనే విమర్శలు వచ్చాయి.



ఎస్ఐ మూర్తి



స్టేషన్ వద్ద బంధువులు

### రివాల్వర్ మిస్ ఫైర్ : ఎస్పీ నయీం



'ఎస్ఐ మూర్తి ఉదయం స్టేషన్‌కు వచ్చారు. అందరితోనూ మాట్లాడి వాష్ రూమ్‌కు వెళ్లారు. అక్కడ రివాల్వర్ మిస్ ఫైర్ అయ్యింది. దీనిని గమనించి సిబ్బంది 108లో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మూర్తి చనిపోయారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి వాస్తవాలు వెలుగులోకి తెస్తాం' అని జిల్లా ఎస్పీ నయీం అస్మి తెలిపారు. ఆయన వెంట ఏఎస్పీ భీమారావు తదితరులున్నారు. ఎస్ఐ కుటుంబానికి న్యాయం చేస్తామని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ఆసుపత్రిలో మూర్తి మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కోటిపల్లిలో శనివారం పోలీసు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు పామర్రు ఎస్ఐ ఎస్కే జానీ బాషా చెప్పారు.



# మెరుపులా.. ఉరుములా..?

## నేడు పార్లమెంటులో కేంద్ర బడ్జెట్
### ఆశలన్నీ నిర్మలమ్మ పైనే

కేంద్ర బడ్జెట్‌లో రైతాంగం కళ్లు తుడిచేలా ప్రోత్సాహకాలు ప్రకటిస్తారా..? దిగాలు పడిన ఆక్వా రంగానికి ఎగుమతి, దిగుమతి రంగంలో ఊరట కల్పిస్తారా..? వేతన జీవులు ఆశిస్తున్నట్టుగా ఆదాయపు పన్ను మిన హాయింపులో ఈసారి కరుణిస్తారా..? అత్యంత కీలకమైన రైల్వే ప్రాజెక్టులకు మోక్షం ఇచ్చేలా కేటాయింపులు ఉండబోతున్నాయా.. అనే ప్రశ్నలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టబోయే పూర్తిస్థాయి కేంద్ర బడ్జెట్‌లో సమాధానం లభించనుంది.

(ఏలూరు -ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :


పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అనువుగా ఐదేళ్లపాటు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇప్పటికే కేంద్ర సహకారం పెరిగింది. డయాఫ్రంవాల్ నిర్మాణంతోపాటు పోలవరం నిర్వాసితులకు రూ.960 కోట్లకు పైగా బకాయిలు చెల్లించారు. ఈ తరుణంలోను ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులంతా తమకు పూర్తిగా చెల్లించాల్సిన బకాయిలన్నింటినీ చెల్లించాలని, తమ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### రైతులను ఆదుకుంటారా..?

ఉద్యానవన పంటలతోపాటు మిగతా పంటలకు కనీస మద్దతు ధర పెరగాలన్న డిమాండ్ ఉంది. కేంద్రం రైతులను ఆదుకునేందుకు ఏటా ఇస్తున్న రూ.ఆరు వేల మొత్తాన్ని రెట్టింపు చేయాలన్న డిమాండ్ ఉంది. కిసాన్ సమ్మాన్ కార్యక్రమం కింద ఈ పెరుగుదల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. కొబ్బరి, ఖోఖో, ఇతర పంటలకు తగినంత ప్రోత్సాహం ఇవ్వాలన్న డిమాండ్‌కు అనుగుణంగానే కేంద్ర బడ్జెట్‌లో సానుకూల సంకేతాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

### ఆక్వాకు ప్రోత్సాహం ఉంటుందా ?

చాన్నాళ్లుగా ఆక్వా రంగం ఒడిదుడుకులు ఎదుర్కొంటుంది. ఎగుమతులు, దిగుమతుల విషయంలో



ఈ రంగం రైతులు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ఆక్వా రంగంలో పెట్టుబడులు పెరగడం, మేతల కొనుగోళ్ల కష్టతరంగా మారడంతో ఆక్వా రైతులు దిగాలు పడ్డారు. ఆక్వా ఉత్పత్తులను ఎగుమతులకు వీలుగా తగినంత ప్రోత్సాహకాన్ని ప్రకటిస్తే రైతులకు కాస్తంత ఊపిరి పోసినట్టు అవుతుంది. విదేశీ మారకద్రవ్యం పెరుగుతుంది.


### బంగారంపై..

బంగారంపై ఆరు శాతం కస్టమ్స్ డ్యూటీ ఉంది. గత బడ్జెట్‌లో 15 శాతం నుంచి 8 శాతం పన్ను మినహాయింపు ఇచ్చారు. ఈసారి బడ్జెట్‌లో పన్ను పెంచుతారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పసిడి ధర ఆల్‌టైం రికార్డులను క్రాస్ చేస్తూ దూసుకుపోతోంది. ఈ క్రమంలో పన్ను పెంచితే పసిడిని సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి ఏర్పడుతుంది.



### వేతన జీవులకు వరం దక్కుతుందా ?

వేతన జీవులంతా చాన్నాళ్లుగా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడల్లా కొంత ఊరట లభిస్తుందనే ఆశతోనే ఉంటూ వచ్చారు. ఆదాయపు పన్ను పరిమితిని రెండున్నర లక్షల నుంచి ఐదు లక్షలకు పైబడి పెంచాలనే డిమాండ్ గత దశాబ్దకాలంగా వేతన జీవుల్లో ఉంది. ఈ దిశగానే ఏటా వార్షిక బడ్జెట్‌లో కేంద్రం ఉద్యోగులకు ఈ వరం ఇవ్వకపోతుందా అని ఎదురుచూస్తూ వస్తున్నారు.



### రైల్వే ప్రాజెక్టులకు మోక్షం ఉందా ?

- కొవ్వూరు-భద్రాచలం లైన్‌లో సర్వే ఈ మధ్యనే పూర్తయ్యింది. భద్రాచలం రోడ్డు నుంచి కొవ్వూరు వరకు కొత్త రైల్వే మార్గం నిర్మాణానికి అనువుగా ఇటీవలే కేంద్ర రైల్వే మంత్రి ఒక ప్రకటన చేశారు. ఈ లైనుకు డీపీఆర్ సమకూరుస్తామని 2,800 కోట్లపైగా ఈ లైనుకు కేటాయింపు చేసే అవకాశం ఉన్నట్టు వెల్లడించారు. వాస్తవంలో చూడాలి.
- నరసాపురం-కోటిపల్లి రైల్వే లైనుకు ఇప్పటి వరకు రూ.1500 కోట్లు కేటాయించగా కొన్ని నిర్మాణాలకు, కొంత భూసేకరణకు సరిపోయింది. జగన్ జమానా లో రాష్ట్రం తన వాటా రూ.500 కోట్లలో రూపాయి చెల్లించలేదు. ఫలితంగా పనులు మందగించాయి. కూటమి ప్రభుత్వం తన వాటాగా రూ.50 కోట్లను మంజూరు చేసింది. దీనికి నిధులు కేటాయించాలి.
- నరసాపురం-మచిలీపట్నం రైల్వే లైను పూర్తి చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. ఈ లైనుకు సంబంధించి ఈ మధ్యనే డీపీఆర్ పూర్తయ్యింది. మిగిలిందల్లా రైల్వే శాఖ అన్ని విధాలా స్పందించడమే.

### మిగతా రంగాల సంగతేంటి ?

పేద వర్గాలను ఆదుకునేలా పీఎంఈవై కింద మంజూరు చేసే గృహాల సంఖ్య రెట్టింపు చేయాలని, విద్యాభివృద్ధికి వీలుగా సమగ్ర శిక్ష కింద నిధుల కేటాయింపు, మహిళా ఆర్థిక ప్రయోజనాలకు నిర్ణయాత్మక నిర్ణయాలు ఉండాలనే అంతా ఆశిస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో అవకాశాల మెరుపులా..? ఇబ్బందులు పెట్టేలా ఉరుముతారా అనేది అందరి నోట ప్రశ్నగానే ఉంది.



చింతలపూడి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కక్షిదారుల రద్దీ

# రిజిస్ట్రేషన్.. కిటకిట!

- చార్జీల పెరుగుదలతో ముందు రోజే అత్యధికుల ఉత్సాహం
- రోజంతా మొరాయించిన సర్వర్..జనం ఎదురుచూపులు
- నేటి నుంచి కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు అమలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలన్నీ శుక్రవారం కిటకిటలాడాయి. ఉదయం నుంచి పొద్దుపోయేంత వరకు పెద్ద సంఖ్యలో రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారంతా గంటల తరబడి వేచి ఉండడమే కాక ఇబ్బందులు పడ్డారు. నేటి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతుండడంతో అంతకంటే ఒక రోజు ముందుగానే రిజిస్ట్రేషన్‌కు ఎగబడ్డారు. జిల్లా వ్యాప్తంగా 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా అవన్నీ రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారితో కిటకిటలాడాయి. నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం 40 రిజిస్ట్రేషన్లు జరగ్గా గురువారం నాటికి ఈ సంఖ్య 104కు పైగానే నమోదైంది. శుక్రవారం రిజిస్ట్రేషన్లకు ప్రజలు తరలిరాగా సాయంత్రం పొద్దుపోయే నాటికి 60 రిజిస్ట్రేషన్లు పూర్తి చేయగలిగారు. ఏలూరు, వట్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో 20 నుంచి 25 శాతం మేర ఒక్కసారిగా పెరగడంతో దీని ప్రభావం కాస్తా రిజిస్ట్రేషన్ చార్జీలపై పడింది. దీనిని దృష్టిలో పెట్టుకుని ముందుగానే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తే పెరిగిన భారం మీద పడకుండా తప్పించుకోగలమన్న భావనలోనే అందరూ కనిపించారు. చింతలపూడి, నూజివీడుల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలూ రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారితో కిక్కిరిశాయి. ఇంతకుముందు రోజుకు 20 నుంచి 30లోపే రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా, ఇప్పుడు ఆ సంఖ్య 80 నుంచి 120కు వరకు పెరిగింది. నూజివీడు పరిసరాల్లో ఈ మధ్యకాలంలో పెద్ద ఎత్తున భూలావాదేవీలు ఒక కొలిక్కి వచ్చాయి. రిజిస్ట్రేషన్ చార్జీల సవరణ జరగకముందే తమ భూముల రిజిస్ట్రేషన్‌కు ఆరాటపడి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు తరలివచ్చారు. కైకలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం అనేకమంది పడిగాపులు పడ్డారు. కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, గణపవరం, మండవల్లి రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల సంఖ్య శుక్రవారం భారీగా పుంజుకున్నాయి. రిజిస్ట్రేషన్ల చార్జీల సవరణ అనూహ్యంగా 10 నుంచి 15 శాతంలోపే ఉంటుందని అందరూ భావించినా దీనికి విరుద్ధంగా మండవల్లి, నూజివీడు, కైకలూరు, పోలవరం, కామవరపుకోటలో 10 నుంచి 25 శాతం మేర చార్జీల సవరణ జరగడంతో అందరూ ఉలిక్కిపడి అందుబాటులో ఉన్న మేరకు రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలన్నీ రద్దీగా మారిన తరుణంలోనే రిజిస్ట్రేషన్ సర్వర్ ఒక్కసారిగా మందగించింది. ఉదయం 11 నుంచి సాయంత్రం పొద్దుపోయేంత వరకు సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారంతా ఆపసోపాలు పడాల్సి వచ్చింది. మరోవైపు సర్వర్ మందగించడంతో కార్యాలయాల సిబ్బంది తంటాలు పడ్డారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు హెలిపాడ్ వద్ద స్వాగతం పలికిన మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు మాజీ ఎమ్మెల్యే ముళ్లపూడి వెంకట కృష్ణారావు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్

# చంద్రబాబుకు ఘన స్వాగతం

వాసవి మాత ఆత్మార్పణ దినం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం పెనుగొండ వాసవీ కన్యకా పరమేశ్వరి క్షేత్రానికి విచ్చేశారు. ఉదయం 11.53 గంటలకు సిద్ధాంతం రోడ్డులోని ఏఎంసీలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. చంద్రబాబుకు పలువురు నేతలు ఘన స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, మాజీ మంత్రి పీతల సుజాత, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు బండారు మాధవనాయుడు, ముళ్ళపూడి వెంకట కృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, వలవల బాబ్జి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోని, పొత్తూరి రామరాజు తదితరులు హెలిప్యాడ్‌వద్ద చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. హెలిపాడ్ వద్ద తణుకు మాజీ ఎమ్మెల్యే ముళ్లపూడి వెంకట కృష్ణారావు భుజంపై చేయి వేసి చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. **- ఆచంట/పెనుగొండ, ఆంధ్రజ్యోతి**

# జై వాసవీ మాత

భక్తులతో కిక్కిరిసిన కన్యకా పరమేశ్వరి ఆలయం వాసవీ ధామ్



పెనుగొండ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద భక్తులు

## భక్తులతో పులకించిన వాసవీ క్షేత్రం

ఆచంట/పెనుగొండ, జనవరి31(ఆంధ్రజ్యోతి): శ్రీనగరేశ్వర మహిషాసుర మర్ధని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం శుక్రవారం భక్తులతో పులకరించింది. వాసవీ మాత ఆత్మార్పణ దినం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం, తొలిసారి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో పెనుగొండ క్షేత్రం ఒక్కసారిగా భక్తులతో కిటకిటలాడింది. కన్యకాపరమేశ్వరి ఆలయం, వాసవి ధామ్ ఆవరణ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో కిక్కిరిసింది. ఆలయాలు వద్దల పెద్ద ఎత్తున హోమాలు నిర్వహించడం సీఎం రాక సందర్భంగా అనేక మంది నాయకులు, కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో పెనుగొండ క్షేత్రం ఒక్కసారిగా మారుమోగిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా పెనుగొండ క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోవంతో పాటు సీఎం రాక సందర్భంగా అటు అధికారులు, ఇటు పోలీసులతో కూడా పెనుగొండ కిక్కిరిసిపోయింది.

**సీఎం పర్యటన సాగిందిలా..**

సీఎం పర్యటన అర్ధగంట ఆలస్యంగా జరిగింది. ఉదయం 11.05 గంటలకు రావాల్సి ఉండగా 11.35 గంటలకు వచ్చిన హెలీకాఫ్టర్ రెండు సార్లు ఆకాశంలో తిరిగి 11.53 గంటలకు ల్యాండ్ అయింది. అక్కడి నుంచి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయానికి చేరుకున్నారు. 12.30 గంటలకు వాసవి ధామ్‌కు చేరుకున్నారు. 1.10 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుని కొంతసేపు అక్కడ నాయకులతో మాట్లాడి సుమారు 2 గంటలకు తిరిగి అమరావతికి బయల్దేరారు.



చంద్రబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ ధర్మకర్తలు



వాసవీ మాతకు నమస్కరిస్తున్న చంద్రబాబు



డోలు, సన్నాయి మేళంతో చంద్రబాబుకు స్వాగతం



జ్ఞాపిక అందజేస్తున్న దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్‌చంద్ర



వాసవీ మాత ఆలయంలో చంద్రబాబుకు సత్కారం



భారీ సంఖ్యలో తరలివచ్చిన మహిళలు



ఆలయంలో అమ్మవారికి పూజలు



అమ్మవారికి ఆలయానికి వెళుతున్న సీఎం చంద్రబాబు



సీఎం చంద్రబాబుకు అభివాదం చేస్తున్న మహిళలు

## చంద్రబాబుకు మహిళల హారతులు

ఆచంట/పెనుగొండ, జనవరి31(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు హెలిప్యాడ్ నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయానికి రోడ్డు మార్గంలో కారులో చేరుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా ప్రజలు నిలబడి బాబుకు స్వాగతం పలికారు. తెలుగు మహిళలు హారతులు పట్టారు. పలు చోట్ల సెల్ఫీ తీసుకున్నారు. మహిళలు ఉన్న చోట్ల చంద్రబాబు కాన్వాయ్ ఆపి మరీ హారతులను తీసుకుంటూ ముందుకు సాగారు.

## బీసీలకు పెద్ద పీట : చంద్రబాబు

ఆచంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బీసీలలో అన్ని కులాల వారికి రాజకీయాలు నేర్పించి చట్ట సభల్లో పదవులు ఇచ్చిన ఘనత నందమూరి తారక రామారావుకు దక్కుతుందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం ఏఎంసీ ఆవరణలలో బీసీలు, పార్టీ నాయకుల సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. టీడీపీ అంటే బీసీలు.. బీసీలు అంటే టీడీపీ అన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ అవకాశాలుకల్పించింది టీడీపీ అన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వ ఘనతను ప్రజల్లోకి వెళ్లే బాధ్యతను బీసీలు తీసుకోవాలన్నారు. రానున్న కాలంలో ఎన్‌డీఏ ప్రభుత్వం బీసీలకు పెద్ద పీట వేస్తుందన్నారు. చట్ట సభల్లో బీసీలకు తగినన్ని పదవుల ఇచ్చామని భవిష్యత్‌లో మరిన్ని పదవులు వచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గీత కులాలకు స్వర్ణ భవిష్యత్తు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ, మంతెన రామరాజు, బండారు మాధవనాయుడు, బీసీ కులాల నాయకులు పాల్గొన్నారు.

## వాసవీ కన్యకా పరమేశ్వరికి పత్యేక పూజలు











భీమవరంలో సువాసినీ పూజల్లో పాల్గొన్న మహిళలు, ద్వారకాతిరుమలలో వాసవీ మాతకు పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి, ఏలూరులో వాసవీ మాతకు పూజలు, ఆగిరిపల్లిలో మహిళల కలశ యాత్ర, మొగల్తూరులో వాసవీ మాత రథయాత్ర

సౌత్ జోన్ పోటీలకు

## జేఎన్‌టీయూకే హ్యాండ్ బాల్ జట్లు ఎంపిక




సౌత్ జోన్ హ్యాండ్ పోటీలకు ఎంపికైన జేఎన్‌టీయూకే బాలికలు, బాలుర జట్లు

దెందులూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, కేరళ) హ్యాండ్ పోటీలకు జేఎన్‌టీయూకే బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. వేగవరంలోని హేలాపురి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో రెండు రోజులుగా జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో జరుగుతున్న ఎంపిక పోటీలు శుక్రవారం ముగిశాయి. ఆరు జిల్లాల అంతర కళాశాలల జట్లు పాల్గొన్న పోటీలు హోరాహోరీగా సాగాయి. బాలికల విభాగంలో ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీ, రామ చంద్ర ఇంజనీరింగ్ కాలేజీ, జేఎన్‌టీ యూ, హేలాపూరి కాలేజీల నుంచి ప్రతిభ కనబరిచిన 16 క్రీడాకారులు బాలుర జట్టుకు ఎంపికయ్యారు. బాలి కల జట్టుకు 16 మంది ఎంపికైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.లావణ్య, ఏవో కరుణానిధి తెలిపారు. బాలికల జట్టు జేఎన్‌టీయూకే తరుపున ఫిబ్రవరి 19న తమిళనాడు రాష్ట్రం సేలంలోని పెరియార్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీలో పాల్గొంటారు. బాలుర విభాగంలో ఫిబ్రవరి 22 నుంచి పెరియార్ యూనివర్సిటీ హ్యాండ్ బాల్ జట్టుగా పాల్గొంటారని ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. కాగా ఎంపిక పోటీలో బాలుర విభాగం విజేతలుగా ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీ, రన్నర్స్‌గా హేలాపురి కాలేజీ జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ జట్టు విజేత కాగా సీఆర్ రెడ్డి కాలేజీ జట్టు రన్నర్స్‌గా నిలిచారు.




## బాస్కెట్ బాల్ ఛాంపియన్‌గా జిల్లా జట్టు

ఏలూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో మహిళల జిల్లా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. విజయవాడ స్టెల్లా కాలేజీలో ఈ నెల 28నుంచి 31 వరకు అంతర్ జిల్లా అండర్ -23 రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పశ్చిమగోదావరి మహిళల జట్టు ఛాంపియన్‌షిప్ సాధించింది. ఆంధ్రప్రదేశ్ మొదటి అండర్ -23 అంతర్ జిల్లా పురుషులు, మహిళా బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహిళల జట్టు లీగ్ పోటీల్లో శ్రీకాకుళం, చిత్తూరు, గుంటూరు, అనంతపూర్ జట్లపై గెలిచి సెమీ ఫైనల్లో విశాఖ జిల్లా జట్టుపై గెలుపొందింది. ఫైనల్లో తూర్పు గోదావరి జిల్లాపై 47-17 స్కోరుతో విజయం సాధించింది. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె.కృష్ణారెడ్డి, గవ్వా శ్రీను, ట్రెజరర్ కె.మురళీకృష్ణ జట్టు సభ్యులను అభినందించారు.

# చేలల్లో డ్రోన్



**• పురుగుమందు పిచికారీకి ఆధునిక సాంకేతికత • రైతులకు ఖర్చు.. సమయం ఆదా**



### ఎకరం 7 నిముషాల్లోనే..

- డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీ చేయడానికి ఎకరాకు 7 నిముషాల సమయం పడుతుంది.
- కూలి మనుషుల ద్వారా అయితే ఒక రోజు సమయం పడుతుంది.
- డ్రోన్ ద్వారా పిచికారీకి డ్రోన్ ఆపరేటర్, రైతు ఉంటే సరిపోతుంది. ఎక్కువ మంది కూలీలు అవసరం లేదు.
- ఒకసారి ఒక మందు పిచికారీకి ఎకరానికి రూ.400 వరకూ ఖర్చు అవుతుంది.
- రైతు, ఆపరేటర్ 2 కిలో మీటర్ల దూరం నుంచి ఆపరేట్ చేయవచ్చు.
- డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం ఉండదు.

తణుకు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో శ్రమ, కాలయాపన, ఖర్చు తగ్గించేందుకు యంత్రాలు దోహదపడుతున్నాయి. వరి నాట్ల నుంచి కోత, ధాన్యం నిల్వ చేసే వరకూ సాంకేతిక పరిజ్ఞానం రైతులకు మేలు చేస్తుంది. వరిలో పురుగు మందులను పిచికారీకి డ్రోన్‌లు అందుబాటులోకి వచ్చాయి. కొన్ని పెద్ద వ్యవసాయ క్షేత్రాలకే పరిమితమైన పురుగు మందులు వెదజల్లే డ్రోన్‌లు ఇప్పుడు గ్రామీణ ప్రాంత పంట చేలల్లో పురుగు మందులను వెదజల్లేందుకు సిద్ధంగా వున్నాయి. ముఖ్యంగా వరి పంటపై ఆశించే చీడ, పీడల నివారణకు డ్రోన్‌ల వినియోగం చాలా అవసరం ఏర్పడింది. దీనిని దృష్టిలో వుంచుకుని రాష్ట్ర ప్రభుత్వం లాం వ్యవసాయ పరిశోధనా స్థానంలో వరి పురుగు మందులు వెదజల్లే డ్రోన్ నిర్వహణలో యువతకు ప్రత్యేక శిక్షణ ఇస్తుంది. దీనితో పాటు ఢిల్లీ కేంద్రంగా పలు సంస్థలు వ్యవసాయంలో డ్రోన్‌ల నిర్వహణకు ప్రత్యేక శిక్షణను ఇస్తున్నాయి. పురుగు మందుల పిచికారీకి డ్రోన్ యంత్రాల నిర్వహణకు సంబంధించి తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో వ్యవసాయ శాఖ ప్రయోగాత్మకంగా నిర్వహించింది.

**డ్రోన్‌తో ఉపయోగాలు..**

విషపూరిత పురుగు మందుల పిచికారీ చేసే వ్యక్తులు రసాయన ప్రభావంతో అనారోగ్యానికి గురువుతున్నారు. ఇలా చేయడం ప్రమాదకరం కావడంతో కూలీలతో పిచికారీ చేయించడానికి ఎక్కువ ఖర్చు అవుతోంది. ఎకరాకు సుమారు 600 నుంచి 700 వరకు కూలీ చెల్లించాలి. ఒక మనిషి ఒక రోజులో రెండు, మూడు ఎకరాలు కంటె ఎక్కువ పొలంలో పురుగు మందులు స్ప్రే చేయలేరు. డ్రోన్ ద్వారా ఎకరం పంటకు మొత్తం పిచికారీ ప్రక్రియ రెండు గంటల్లో ముగుస్తుంది.

### పది లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్‌తో గాల్లోకి..



డ్రోన్ తరలించడానికి ప్రత్యేక బైక్

10 లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్‌తో డ్రోన్ గాల్లో ఎగురుతుంది. దీనికి ఆరు బ్యాటరీలు అమర్చి ఉంటాయి. ఒక బ్యాటరీ సుమారు 2 గంటల పాటు పని చేస్తుంది. ఒక బ్యాటరీ చార్జింగ్ పూర్తి కాగానే టేక్ ల్యాండ్ చేసి మరో బ్యాటరీ అమర్చాలి. అలా తీసేసిన బ్యాటరీని మరలా చార్జింగ్ చేసి మరలా వినియోగించేలా రిజర్వులో ఉంచుకునే అవకాశం ఉంది. ఆరు బ్యాటరీలు సుమారు 12 గంటల పాటు డ్రోన్ తిరిగేందుకు పని చేస్తాయి. ఒక్కో డ్రోన్ ఖరీదు రూ. 16 లక్షల వరకూ ఉంటుంది. ఇంకా తక్కువ ఖరీదులో వున్నా అన్ని పరిస్థితులకు అనుకూలంగా ఉండవు. వీటిలో నకిలీ డ్రోన్‌లు కూడా ఉంటాయి జాగ్రత్తగా వుండాలి.

### బీఎస్సీ ఆక్వా కల్చర్ చదివి డ్రోన్ లైసెన్స్ తీసుకున్నా





నేను బీఎస్సీ ఆక్వా కల్చర్ చదివాను. మానాన్న మద్దూరి రాంబాబు వ్యవసాయం చేస్తారు. ఆయనకు సహాయంగా నేను, నాతో పాటు బీకాం చదివిన నా సోదరుడు నారాయుడు కలసి ఉన్న ఊరిలోనే ఆధునిక యంత్రాలతో లాభసాటి వ్యవసాయం చేయాలనుకున్నాం. ఢిల్లీలో డ్రోన్ వెర్స్ కంపెనీలో శిక్షణ పొందాం. వరి పంటలో పురుగు మందుల పిచికారీకి సంబంధించి డ్రోన్ నిర్వహణకు 20 రోజుల శిక్షణ తీసుకున్నాం. డ్రోన్ ఫ్లైయింగ్, స్ప్రేయింగ్, డ్రోన్ టేకాఫ్, ల్యాండింగ్ వంటి అంశాలపై పూర్తిస్థాయి శిక్షణ పొంది, డ్రోన్ నిర్వహణకు సంబంధించిన లైసెన్స్ కూడా పొందాం. అనందరం రూ.16 లక్షలు వెచ్చించి డ్రోన్ కొనుగోలు చేశాం. దీనిని ఒక చోట నుంచి మరో చోటకు తరలించేందుకు బైక్‌ను కూడా కొనుగోలు చేసి రవాణాకు ప్రత్యేక ఏర్పాట్లు చేయించాం. సొంత బైక్ పైనే డ్రోన్ అవసరం ఉన్న చోటికి రవాణా చేయడం సులభం. దీనిని పొలాల మధ్యలో లాండింగ్ చేయడం కూడా చాలా సులభం.

**-మద్దూరి లక్ష్మణ్, నారాయుడు, డ్రోన్ ఆపరేటర్లు, దువ్వ**

### మండలానికి ఒక డ్రోన్ ప్రతిపాదన : ఎంవీ.రమేష్, ఏడీఏ తణుకు



వరి పంటకు పురుగు మందుల పిచికారి చేసేందుకు అవసరమైన డ్రోన్‌లకు సంబంధించి మండలానికి ఒక యూనిట్ చొప్పున ప్రతిపాదనలు పంపించాం. రైతుమిత్ర గ్రూపుల నుంచి ఎంపిక చేసి అర్హులైన వారికి డ్రోన్ నిర్వహణపై శిక్షణ ఇచ్చేందేందుకు కూడా ప్రతిపాదనలు పంపించాం. లాంలో అన్ని రకాల పురుగు మందుల పిచికారికి సంబంధించిన శిక్షణ ఇస్తున్నారు.

# లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

**8న ప్రారంభం, 10న కల్యాణం, 12న చందనోత్సవం**



ద్వారకాతిరుమల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): సుందర గిరిపై కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 8 నుంచి 13 వరకు కల్యాణమహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఈక్రమంలో నెలపొడుపు మంచిది కావడంతో కల్యాణ మహోత్సవ పనులను శుక్రవారం ప్రారంభించారు. స్వామివారి పల్లకి వాహనాన్ని, ఉయ్యాలను సిబ్బంది పాలిష్ చేస్తున్నారు. శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన మండలంలోని ఐఎస్ జగన్నాధపురంలో కొలు వైన స్వామివారి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న ఉదయం 10గంటలకు స్వామివారిని, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేస్తారు. సాయంత్రం 6 గంటలకు ధ్వజావరోహణ జరుగుతుందన్నారు. 10న ఉదయం 11-10 గంటలకు స్వామివారి కల్యాణం, 11న గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 12న పంచామృతాభిషేకాలు, శ్రీచందనోత్సవం, ధ్వజ అవరోహణ, 13న శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

## కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో మేలు



మాట్లాడుతున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్‌కుమార్

ఏలూరు క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కేసులు త్వరితగతిన పరిష్కరించడానికి మధ్య వర్తిత్వం ఎంతో ఉపయోగపడుతుందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయ మూర్తి ఎం.సునీల్‌కుమార్ అన్నారు. ఐదు రోజుల పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రిటైర్డ్ న్యాయమూర్తులకు, ఎంపిక చేసిన న్యాయవాదులకు, సోషల్ వర్కర్లకు ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ భవనంలో నిర్వహించిన మధ్యవర్తుల శిక్షణతరగతులు ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ ఐదు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా జడ్జి పి.మంగకుమారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారామ్, జాతీయ న్యాయ అధికార సంస్థ, న్యూఢిల్లీ రిసోర్స్ పర్సన్స్ పుష్పగుప్తా, దీపక్ డింగరా పాల్గొన్నారు.



సన్మానగ్రహీతలతో యద్దనపూడి కుటుంబ సభ్యులు, జర్నలిస్టులు

# యద్దనపూడి సేవలు ఆదర్శప్రాయం

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 31 (ఆంధ్ర జ్యోతి):సీనియర్ పాత్రికేయులు, సామాజిక కార్యకర్త యద్దనపూడి సూర్యనారాయణమూర్తి వర్ధంతిని శుక్రవారం తాడేపల్లిగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఐజేయూ జాతీయ కార్యదర్శి దూసనపూడి సోమ సుందర్, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జ్ దేవగళ్ల రామకృష్ణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తమ్మిశెట్టి రంగసురేష్ అధ్యక్షతన జరిగిన సభలో స్థానిక ఆంధ్రజ్యోతి రిపోర్టర్ మైలవరపు రవికిరణ్‌కు ఈ ఏడాది జిల్లా ఉత్తమ జర్నలిస్టు అవార్డుతోపాటు రూ.5,116 నగదు బహుమతిని అందజేశారు. ఆయనతోపాటు సీనియర్ పాత్రికేయులు గంటా వేణుగోపాల్, సీహెచ్ రామ కృష్ణరాజు, పాలడుగుల రామకృష్ణలను సత్కరించారు. గత ఏడాది ప్రభుత్వ బాలికల పాఠశాలలో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన మీసాల అనూషకు రూ.5,116లను సూర్యనారాయణమూర్తి కుమార్తె పద్మావతి అందించారు. రామకృష్ణ మాట్లాడుతూ యద్దనపూడి వార్తలు రాయడమే కాకుండా సామాజిక సమస్యల పరిష్కారానికి తనదైన శైలిలో కృషి చేశారని, ఆయనను నేటి తరం జర్నలిస్టులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కట్రెడ్డి రామకృష్ణ, గజపతి వరప్రసాద్, యడ్లవల్లి మురళికృష్ణ, ఎస్వీ లక్ష్మయ్య, గొలిమే బుజ్జిబాబు, యద్దనపూడి సుబ్బారావు, విన్నకోట సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

**ఎస్టీ కమిషన్ సభ్యుడు వి.శంకర్ నాయక్**



బుట్టాయగూడెంలో శంకర్ నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, గిరిజనులు

పోలవరం/బుట్టాయగూడెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఏజన్సీ గ్రామాల్లో ఏపీ స్టేట్ ఎస్టీ కమిషన్ సభ్యుడు వి.శంకర్ నాయక్ శుక్రవారం పర్యటించారు. జిల్లెల్లగూడెం పంచాయతీ రెడ్డి కుంకాల గ్రామంలో పర్యటించి స్థానిక గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తొలుత కుంకాల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు అధికారులు ఎస్టీ కమిషన్ సభ్యునికి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి సన్మానం చేశారు. అనంతరం స్థానిక గిరిజనులతో సమావేశం నిర్వహించి సమస్యలపై పరిష్కారాలు సత్వరమే చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. శ్మశాన వాటికకు రాకపోకలు సాగించే మార్గం విషయంలో సంబంధిత రైతుతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని తహసీల్దారు సాయిరాజుకి సూచించారు. స్థానిక మంచినీటి పైపులైన్లు, మోటారు, మరమ్మతుల సమస్యపై ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గంగరాజుని రెండు రోజుల్లో సమస్య పరిష్కరించి ఫొటోలు తమకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఐటీడీఏ ఏపీవో పీఎస్ శ్రీనివాస్ నాయుడు, గిరిజనులు పాల్గొన్నారు.

### భూ సమస్యను పరిష్కరించాలి

బుట్టాయగూడెం మండల కేంద్రంలో గిరిజన -గిరిజనేతరుల మధ్య నెలకొన్న భూసమస్యను పరిష్కారించి ఆదివాసీలకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు వి.శంకర్ నాయక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వివాదాలకు కారణమైన భూమిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ పుంత పోరంబోకు భూమిలో గిరిజనులు గుడిసెలు వేసుకుంటే భూమి తనదేనంటూ గిరిజనేతరులు గురువారం గుడిసెలను తొలగించాలని ప్రయత్నించగా తామంతా అడ్డుకున్నామని కమిషన్ సభ్యుడి దృష్టికి తెచ్చారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని గిరిజనులు శంకర్ నాయక్‌కు వినతిపత్రాలు అందజేశారు.

## మాజీ సర్పంచ్ బసవరాజు మృతి

**పాడె మోసిన ఎమ్మెల్యే రోషన్‌కుమార్**



మోటేపల్లి బసవరాజు పాడె మోస్తున్న ఎమ్మెల్యే రోషన్

జంగారెడ్డిగూడెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జనసేన నాయకుడు, మాజీ సర్పంచ్ మోటేపల్లి బసవరాజు (75) ఆఖరి మజిలీలో ఆ నలుగురిలో ఒక్కరై ఆయన పాడె మోసి అందరికీ ఆదర్శంగా నిలిచారు చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్. జంగారెడ్డిగూడెం మండలం వేగవరం మాజీ సర్పంచ్ మోటేపల్లి బసవరాజు (75) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శుక్రవారం వేగవరం వెళ్ళి మృతుడు మోటేపల్లి బసవరాజు కుటుంబాన్ని పరామర్శించి ఆయన పార్థివదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాడె మోసి అంత్యక్రియలలో పాల్గొన్నారు.

# అడుగంటిన గోదావరి

**తేలుతున్న ఇసుక తిన్నెలు**

**రబీ గట్టెక్కేదెలా..**



పోలవరం వద్ద తేలిన ఇసుక తిన్నెలు

పోలవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలంలో గోదావరి జలాలు క్రమంగా అడుగంటుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు ఎగువన నీటి మట్టం తగ్గడంతో స్పిల్‌వే క్రస్ట్ లెవెల్‌కి దిగువకు నీటిమట్టం పడిపోయింది. ప్రాజెక్టు స్పిల్‌వేలో దిగువన ఉన్న స్లూయిజ్‌ల నుంచి మాత్రమే నీటి విడుదల జరుగుతున్నది. దీంతో పోలవరం ప్రాజెక్టు దిగువన నదిలో నీటిమట్టం తగ్గిపోయి నదిలో ఇసుకతిన్నెలు తేలుతున్నాయి. గోదావరి నీటిమట్టం గోదారిలో 13.4 మీటర్లకు చేరుకోవడంతో పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి ఈ ఏడాది రబీకి పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు నీరందే అవకాశాలు లేవు. ఇటీవల సీలేరు నుంచి హైడ్రో ప్రాజెక్టు జలాలు విడుదల చేయడంతో ప్రాజెక్టు ఎగువన నీటిమట్టం కొంత పెరిగినప్పటికీ ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేసే విధానంలో భవిష్యత్ సాగునీటి అవసరాల కోసం జలాలను మదుపు చేస్తూ స్పిల్‌వేలో ఉన్న పది స్లూయిజ్‌లలో నాలుగు స్లూయిజ్‌లను మూసివేసి ఆరు స్లూయిజ్‌ల ద్వారా నీటి విడుదల చేస్తున్నారు. విడుదలైన జలాలు 902 ప్రాంతం వద్ద దిగువ కాఫర్ డ్యాంకి మట్టి రాతి తరలింపు వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఏర్పాటు చేసిన రోడ్డు మార్గంలో ఏర్పాటు చేసిన తూరల నుంచి ప్రవహిస్తున్న క్రమంలో ప్రాజెక్టు స్పిల్ ఛానల్ దిగువన నీటిమట్టం తక్కువగా ఉంటుంది. దీనికి తోడు ఉభయ గోదావరి జిల్లాల డెల్టాలకు ధవళేశ్వరం వద్ద కుడి ఎడమ కాలువలకు నిరంతరాయంగా నీటి పంపిణీ జరుగుతుండడం వలన పోలవరం ప్రాజెక్టు దిగువన నీటి మట్టం క్రమక్రమంగా తగ్గుతున్నది. మండల పరిధిలో ఉన్న కడమ్మ ఎత్తిపోతల పథకం, గూటాల ఎత్తిపోతల పథకం ద్వారా నీటి విడుదల జరుగుతున్నప్పటికీ ఫిబ్రవరి నాటికి నీటి నిల్వలు పూర్తిగా తగ్గి స్థానిక పంపింగ్ స్కీములకు నీరందే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పటికే పట్టిసీమ ఎత్తిపోతల పథకం నీటి విడుదల నిలిపివేయడంతో పోలవరం నుంచి ఇబ్రహీంపట్నం వరకూ ప్రాజెక్టు కుడి కాలువ పరిధిలో రబీ పంటలకు సాగునీరు అందకుండా పోయింది. దీంతో మెట్ట ప్రాంతాల్లో బోర్లు ఉన్న సాగు భూములకు తప్ప మిగులు భూములకు సాగునీరు లేదు. ప్రాజెక్టు కుడి కాలువకు కొన్ని ప్రాంతాల్లో లాకుల ద్వారా నీటి నిల్వలు చేసుకున్న రైతులు మాత్రం ఈ ఏడాది రబీని గట్టెక్కించేందుకు సరిపడా సాగునీటి వినియోగం చేసుకుంటున్నారు. ప్రాజెక్టు కుడి కాలువకు పొడవునా మండలాల పరిధికి ఒకటి చొప్పున లాకులు ఏర్పాటు చేసుకుంటే నీటి విడుదల నిలిపివేసే సందర్భంలో లాకులు మూసి నీటి నిల్వలు చేసుకోవడం వలన సాగునీటి ఎద్దడి ఉండదని రైతులు చెబుతున్నారు. ఈ విషయంపై పోలవరం ప్రాజెక్టు డివిజన్ 4 ఈఈ ప్రేమ్‌చంద్‌ని వివరణ కోరగా ప్రస్తుతం డెల్టా అవసరాలకు సరిపడే విధంగా పదివేల క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ఫిబ్రవరి నాటికి నీటి ఎద్దడి ఉండే అవకాశాలున్నప్పటికీ సీలేరు నుంచి అవసరాన్ని బట్టి నీటిని పంపిణీ చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు

**నేడు ప్రాజెక్టు పరిశీలనకు అంతర్జాతీయ నిపుణుల బృందం**

పోలవరం ప్రాజెక్టుని అంతర్జాతీయ నిపుణుల బృందం శనివారం పరిశీలన చేయనుంది. అమెరికాకు చెందిన అంతర్జాతీయ నిపుణులు డియాన్ ఫ్రాన్కో డి కికో, డేవిడ్ పాల్ స్వయంగా పరిశీలన కార్యక్రమంలో పాల్గొంటారని కెనడాకు చెందిన నిపుణులు వీడియో కాన్ఫరెన్సు ద్వారా పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రంవాల్ నిర్మాణంలో టి 16 ప్లాస్టిక్ కాంక్రీట్ వినియోగం జరుగుతున్న నేపథ్యంలో పనులు ఏవిధంగా జరుగుతున్నాయి. డయాఫ్రంవాల్ నిర్మాణంలో ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సింగ్ , పటిష్టత, ట్రెంచ్ కటింగ్‌లో సేకరించిన మట్టి, రాతి నమూనాలు భూఅంతర్భాగంలో పొరల పటుత్వం తదితర అంశాలపై బృందం పరిశీలించనుంది. డయాఫ్రంవాల్ ప్లాస్టిక్ కాంక్రీటు పనులలో వివిధ సలహాలు సూచనలు ఈ బృందం ఇంజనీరింగు అధికారులకు ఇవ్వనుంది.

# మొదటి కాంటూరులో కలపాలంటూ ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నిర్వాసితులు

వేలేరుపాడు, జనవరి 31 (ఆంధ్ర జ్యోతి): పోలవరం ప్రాజెక్టు ముంపులోని గ్రామాలను ఇరిగేషన్ అధికారులు రెండు కాంటూరులుగా విభజించారు. మొదటి కాంటూరు 41.15గానూ 2వ కాంటూరు 45.72 కాంటూరులుగా గ్రామాలను పరిగణలోకి తీసుకున్నారు. అయితే వేలేరుపాడు మండలంలో కాంటూరుల ఎంపిక సరిగా లేకపోవడంతో రెండవ కాంటూరు 45.72 గ్రామాలు ప్రాజెక్టు నిర్మించకుండానే బ్యాక్ వాటర్ రాకముందే ప్రతి ఏటా జూలై, ఆగస్టు నెలల్లో గోదావరి నదికి సంభవించే వరదల కారణంగా మునిగిపోతున్నాయని తమ గ్రామాలను కూడా మొదటి కాంటూరులో కలపాలంటూ అనేక సంవత్సరాలుగా వేలేరుపాడు మండలంలోని 45.72 కాంటూరులో ఉన్న గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తూ వచ్చారు. ఇటీవల మరో 13 గ్రామాలను మొదటి కాంటూరు పరిధిలోకి తెచ్చేలా జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలో తమ గ్రామాలు లేకపోవడంతో నిర్వాసిత ప్రజల్లో ఆగ్రహం తీవ్ర స్థాయిలో చేరుకుంటుంది. ఈ నేపధ్యంలోనే శుక్రవారం నాడు 2వ కాంటూరులో ఉన్న చాగరపల్లి, తాటుకూరు గొమ్ము కాలనీ, నడింగొమ్ము కాలనీ, యర్రబోరు కొర్రాజులగూడెం, గీగావారిగుంపు, కరటంవారిగుంపు గ్రామాల ప్రజలు అధికారుల తీరును నిరసిస్తూ దాదాపు 2వేల మంది స్థానిక అంబేడ్కర్ సెంటర్ నుంచి ప్రదర్శనగా వెళ్ళి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈధర్నాకు సీపీఐ, సీపీఎం, వైసీపీ కాంగ్రెస్ పార్టీల నాయకులు కూడా తమ సంఘీభావాన్ని తెలిపారు. వినతి పత్రాన్ని ఆర్ఐ భుజంగరావుకు ఇచ్చారు.

## ఐదు రకాల బడులపై అభ్యంతరాలు రావొద్దు

**డీఈవో వెంకట లక్ష్మమ్మ**

ఏలూరు అర్బన్, జనవరి 31 (ఆంధ్ర జ్యోతి) : పంచాయతీ యూనిట్‌గా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణతో ఏర్పాటు చేయతల పెట్టిన ఐదురకాల బడులపై మరో దఫా పునఃపరిశీ లనచేసి అభ్యంతరాలకు తావులేకుండా తుది ఖరారు చేయాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు. శుక్రవారం స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో జిల్లాలోని ఎంఈవో లు, క్లస్టర్ హెచ్ఎంలు, డేటా ఎంట్రీ ఆపరే టర్లతో ఐదురకాల బడులపై ఇప్పటికే రూపొందించిన ప్రతిపాదనలను పునఃపరిశీలన చేసేందుకు సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ కలెక్టర్ చేసిన సూచనల మేరకు 20 మంది కంటే తక్కువ ఎన్‌రోల్ మెంట్ వున్న ఫౌండేషనల్ పాఠశాలలను బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలను సూచించాలని కోరారు. ఇప్పటికే పంచాయతీలవారీగా ప్రతిపాదించిన ఫౌండేషనల్, బేసిక్ ప్రైమరీ స్కూళ్ళలో విద్యార్థుల ఎన్‌రోల్ మెంట్‌ను ఎంఈవోలు మళ్ళీ వెరిఫికేషన్ చేయాలని కోరారు. మండలాల్లో ప్రతిపాదిత పాఠశాలల్లో బాలబాలికల ఎన్‌రోల్ మెంట్, ఉపాధ్యాయుల సంఖ్య, విద్యార్థులకు చెల్లించాల్సిన రవాణాభత్యం తదితర వివరాల్లో తేడాలుంటే మార్పులు చేయాలని ఆదేశించారు. డీఈవో కార్యాలయ ఏడీ-2 షరీఫ్, ఐదురకాల పాఠశాలల విధానం జిల్లా నోడల్ ఆఫీసర్ సర్వేశ్వరరావు, పాల్గొన్నారు.

## జాతీయ పోటీలకు రిఫరీగా సూర్యనారాయణ



తణుకు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 14 వరకు నిర్వహిస్తున్న జాతీయ క్రీడలలో పెంటాథ్లెన్ (రన్నింగ్, స్విమ్మింగ్) పోటీలకు రిఫరీగా తణుకు రూరల్ మండలం మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ సంకు సూర్యనారాయణ ఎంపికైనట్లు హెచ్ఎం ఆర్ మోహన్ బాబు తెలిపారు. ఈమేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. దేశీయ ఒలింపిక్స్‌గా పిలవబడే జాతీయ క్రీడలకు తమ పాఠశాలకు చెందిన పీడీ ఎంపైర్‌గా నియమితులు కావడం పట్ల గ్రామ సర్పంచ్ జానా వెంకట లక్ష్మీ, టీడీపీ నాయకులు ఆత్మకూరి రామకృష్ణ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గూడూరి మహాలక్ష్మీ హర్షం వ్యక్తం చేశారు.

## సోషల్ మీడియాలో తప్పుడు కథనంపై ఫిర్యాదు

పాలకొల్లు అర్బన్, జనవరి, 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్‌పై ఏ విధమైన ఆధారాలు లేకుండా తప్పుడు కథనం రాశారంటూ సోషల్ మీడియా ప్రతినిధిపై పట్టణ పోలీస్‌లకు చాంబర్ ప్రతినిధులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఛాంబర్ అధ్యక్షుడు కేవీఆర్ నరసింహారావు మాట్లాడుతూ వాస్తవాలు లేకుండా సోషల్ మీడియాలో వచ్చిన కథనంపై ఛాంబర్ కార్యవర్గ అత్యవసర సమావేశం నిర్వహించిందని, సమావేశానికి 36 అనుబంధ సంఘాలు ఉన్నాయని, వాటి అధ్యక్ష కార్యదర్శులు అందరూ హాజరై ఈ కథనాన్ని ఖండిస్తూ తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు. అలాగే తప్పుడు కథనం రాసిన ప్రతినిధిపై శుక్రవారం రాత్రి పట్టణ సీఐ కె రజనీ కుమార్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

## క్రైమ్ కార్నర్

### గుర్తు తెలియని వ్యక్తి మృతి



కామవరపుకోట, జనవరి 31 (ఆంధ్ర జ్యోతి) : కామవరపుకోట పంచాయతీలోని కొత్తూరు నుంచి ద్వారకా తిరుమల వెళ్ళే రహదారిలో గ్రోమోర్ సమీపంలో ఒక గుర్తు తెలియని 65 సంవత్సరాల వ్యక్తి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెంది ఉన్నాడని తడికలపూడి ఎస్ఐ చిన్నారావు, ఏఎస్ఐ వీరాస్వామి, రైటర్ సుధీర్ తెలిపారు. ఫొటోలో ఉన్న వ్యక్తి వివరాలు తెలిస్తే తెలియజేయాలని తడికలపూడి ఎస్ఐ సెల్ నెంబర్ 9440796678కు సమాచారం అందించాలని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తిది తిమ్మాపురం గ్రామానికి చెందినవాడై అయి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు.

### రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

అత్తిలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం జరిగిన ఈ ఘటనలో శరీరం నుంచి తల వేరైంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సుమారు 35 సంవత్సరాల వయసు కలిగిన ఈ వ్యక్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

### ఆకతాయిల అరెస్టు

ఏలూరు క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వివిధ కాలేజీల వద్ద విద్యార్థినులను వేధిస్తున్న ఆకతాయిలను అభయ మహిళా రక్షక బృందం గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కళాశాల వద్ద శుక్రవారం సాయంత్రం ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు యువకులను అభయ మహిళా రక్షక బృందం అదుపులోకి తీసుకుని త్రి టౌన్ పోలీసులకు తదుపరి చర్యలు నిమిత్తం అప్పగించారు. దీంతో ఆ ముగ్గురిపై త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పిచ్చి కుక్క స్వైరవిహారం

**ఎనిమిది మందికి గాయాలు**



గాయపడ్డ లక్ష్మి

జంగారెడ్డిగూడెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలో కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. శుక్రవారం పట్టణంలోని సాలిపేట జంక్షన్, సిఎస్ఆర్ మాల్ వద్ద ఓ పిచ్చికుక్క దాడిలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. గాలి లక్ష్మి అనే మహిళ ముఖంపై పిచ్చికుక్క దాడి చేయడంతో ఆమె ముఖంపై తీవ్ర గాయాయ్యాయి. కె.చంద్ర నాయుడు కాళ్ళు, చేతులపై తీవ్ర గాయాయ్యాయి. వీరిని ఏలూరు ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రి లో చేర్చారు. స్థానికులు పిచ్చికుక్కను చంపడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# వికటించిన ఆహారం

**11 మంది యువతులకు అస్వస్థత**

**వట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స**



పెదపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఆహారపదార్థాలు వికటించడంతో 11 మంది యువతులు వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరారు. వట్లూరులోని టెక్నికల్ ట్రైనింగ్ అభివృద్ధి సెంటర్ (టి.టి.డి.సి.)లో సీడ్ యాప్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్ డీఏ) ఆధ్వర్యంలో జిల్లాలోని 37 మంది గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతులకు భోజనం, వసతి కల్పించి ఉచితంగా నాలుగు నెలల పాటు ఉపాధి అవకాశాలపై శిక్షణను అందిస్తున్నారు. వీరికి అందించిన పలావ్, చికెన్, కిచిడి వంటి ఆహారపదార్థాలు వికటించడం వల్లనో, లేక మరేదైనా కలుషితం కావడం వల్లనో తెలియదు గాని గురువారం ఉదయం నుంచి కొంతమంది స్వలంగా కడుపునొప్పి, ఇతర అనారోగ్య సమస్యల బారినపడ్డారు. అది మరింత పెరిగి శుక్రవారం ఉదయానికి 11 మంది కడుపునొప్పి, వాంతులతో తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. అధికారులు వారిని దగ్గరలోని వట్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. ఆ తర్వాత వారంతా కోలుకోవడంతో మధ్యాహ్నానికి శిక్షణా కేంద్రానికి తరలించారు.

## ఏలూరు నగరంలో సెల్‌ఫోన్ చోరీ ముఠాలు

ఏలూరు క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలో సెల్‌ఫోన్లు తస్కరించే ముఠాలు వచ్చాయి. ఇప్పటి వరకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రైతు బజార్లు, రద్దీగా ఉన్న ప్రదేశాల్లో మాత్రమే సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయని బాధితులు చెప్పారు. శుక్రవారం నుంచి నగరంలో కొత్తరకం ముఠాలు సంచరిస్తున్నాయి. నగరంలో మూడు ప్రదేశాల్లో సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయి. కండ్రిక గూడెం నుంచి తంగెళ్ళమూడి ప్రాంతంలోని మెడికల్ షాపు వద్ద నిలబడి ఉన్న ఒక అధికారికి ఎదురుగా ఒక మోటారు సైకిల్‌పై వచ్చిన వ్యక్తి పడిపోయినట్లుగా నటించాడు. అందరూ అటువైపే చూస్తున్నారు. అంతలోనే ఒక యువకుడు అధికారి జేబులో ఉన్న సెల్‌ఫోన్ క్షణంలో లాగి పడిపోయిన వ్యక్తి మోటారు సైకిల్‌పై సిద్ధంగా ఉండడంతో ఆ మోటారు సైకిల్‌పైనే పరారీ అయ్యాడు. చూస్తున్నవారంతా అవాక్కయ్యారు. తంగెళ్ళమూడి ప్రాంతంలోను, పాతబస్టాండ్ సమీపంలోనూ శుక్రవారం ఇలాంటి సంఘటనలు జరిగాయి. బాధితులు వెంటనే తమ ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్‌ఆఫ్ చేసేశారు. ఇంక వారు వాట్సప్ హెల్ప్‌లైన్ నెంబర్ 9550351100కు హాయ్ అని మెస్సేజ్ పంపి తమ ఫోను ఐఎంఇఐ నెంబర్, తమ ఆధార్‌కార్డు, చిరునామా, ఫోను బిల్లు వంటివి అప్‌లోడ్ చేసుకుని ఫిర్యాదు చేసుకున్నారు. నగరంలో పోలీసులు నిఘా పెంచాలని పలువురు కోరుతున్నారు. ఈ నేరస్తులు వినియోగిస్తున్న వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఉండడం లేదని చెప్తున్నారు. నగరంలో నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి పెడితేకాని ప్రజల ఫోన్లకు రక్షణ ఉండదని పలువురు ఆరోపిస్తున్నారు.

## రహదారి ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

**అధ్వానంగా కుక్కునూరు ఆర్‌అండ్‌బీ రహదారి**



గాయపడిన కాకి బాబు .. సొమ్మసిల్లి పడిపోయిన జగిడి వెంకమ్మ

కుక్కునూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇసుకపాడు, లంకాలపల్లి గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై శుక్రవారం సాయంత్రం ప్రమాదం చోటు చేసుకున్నది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారు రహదారిపై ఉన్న చిన్నచిన్న రాళ్ళను తప్పించబోయి అదుపు తప్పి క్రిందపడి పోయారు. ఈ ప్రమాదంలో కాకి బాబు తీవ్రంగా గాయపడ్డాడు. జగిడి వెంకమ్మ సొమ్మసిల్లి పడిపోయింది. కాకి రాజు అనే వ్యక్తి మోకాళ్ళ పై తీవ్రంగా గాయమైంది. ఈ క్రమంలో 108 వాహనం వేరే కేసు నిమిత్తం అందుబాటులో లేదు. ఈ క్రమంలో క్షతగాత్రులకు తీవ్రంగా రక్తస్రావం అవుతున్నది. అదే సమయంలో పోలీస్ ఇంటెలిజెన్స్ శాఖలో పని చేస్తున్న శేఖర్ అనే వ్యక్తి అటువైపుగా వచ్చిన క్రమంలో వారిని వెంటనే కారులో ఎక్కించి కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంటనే వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఇది ఇలా ఉండగా కుక్కునూరు ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారిని బిల్లు చెల్లించలేదనే కారణంతో గత మూడు నెలలుగా పనులు నిలిపివేశారు. దీంతో రహదారి అధ్వానంగా తయారైంది.

## 45 నాటు కోళ్లు చోరీ

ద్వారకాతిరుమల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాళ్లకుంటలో 45 నాటు కోళ్ల చోరీకి గురయ్యాయి. ద్వారకాతిరుమలకు చెందిన ములకాల పానకాలు రాళ్లకుంటలో వంద వరకు నాటుకోళ్లను పెంచుకుంటున్నాడు. ప్రతి రోజూ రాత్రివేళ సైతం కోళ్ల వద్దనే పడుకుంటున్నాడు. అయితే గురువారం తన బంధువు చనిపోయాడని ఇంటికి వెళ్లిన పానకాలు శుక్రవారం వెళ్లి చూసుకునేసరికి 45 కోళ్ల కనిపించలేదు. దీంతో లబోదిబో మంటూ ద్వారకా తిరుమల పోలీసులను ఆశ్రయించాడు.

# ముసుగు పడింది..

అమల్లోకి పట్టభద్రుల ఎమ్మెల్సీ కోడ్..

ఏలూరు,జనవరి 31(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలుతో ఏలూరు నగరంలోని పలుచోట్ల కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది రాజకీయ నేతల విగ్రహాలకు శుక్రవారం ముసుగులు తొడిగారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని వైఎస్ఆర్, ఎన్టీఆర్, రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ విగ్రహాలకు ముసుగులు వేశారు. జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న పలు విగ్రహాలకు తెల్లని వస్త్రాలను పూర్తిగా చుట్టేశారు. ఇక్కడే ప్రభుత్వ పథకాలతో అమలుతో ఛైర్మన్, ఇతర నాయకుల పేర్లతో వేసిన బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించారు. దశలవారీగా అన్ని చోట్ల కోడ్ అమలు కింద తెరలు వేయడంతో పాటు బ్యానర్లు, కటౌట్ల తొలగింపును అధికారులు బృందాల వారీగా వెళ్లి తొలగిస్తున్నారు.



జడ్పీ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ విగ్రహానికి ముసుగు వేస్తున్న దృశ్యం

## కళా వారసత్వానికి వైఎంహెచ్ఏ హాలు ప్రతీక : బడేటి చంటి

ఏలూరు రూరల్/ఏలూరు టూటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కళా వారసత్వానికి లలిత కళల ప్రదర్శన వేదిక అయిన 120 ఏళ్ల క్రితం నిర్మించిన హిందూ యువజన సంఘం (ఐఎమ్‌హెచ్ఏ) హాలు ప్రతీక అని, పూర్వ ప్రాభవాన్ని మరువకుండా ఆధునికీకరించిన ఎయిర్ కండీషన్ హాలును శుక్రవారం ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారం భించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో సాంస్కృతిక కళలకు నిలయంగా వర్ధిల్లుతున్న వైఎంహెచ్ఏ హాలు, ఎయిర్ కండిషన్‌గా నవీక రించటం గొప్ప పరిణామం అన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, తపనా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి మాట్లాడారు. తొలుత ప్రముఖ కేశాల ఎగుమతి వ్యాపారులు మడుపల్లి మోహన్ గుప్తా, వీవీ హనుమంతరావు దంపతులు అంబికా ప్రసాద్, చామర్తి కృష్ణారావు తదితరు లు ఏసీ ఆన్‌చేసి కార్యక్ర మం ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు వై.సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కమిటీ అధ్యక్షుడు జి.మోహన్ విఠల్, వీవీ బాలకృష్ణారావు, అంబికా రాజా, మజ్జి సూర్యకాంతారావు పాల్గొన్నారు.



ఏసీ హాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటి

### ప్రజాదర్బార్‌తో సమస్యలు పరిష్కారం

వైసీపీ పాలనలో ప్రజలు ఎన్నో సమస్యలు ఎదర్కొన్నారని, అలాంటివి పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం ప్రజాదర్బార్ పేరుతో రాష్ట్ర ప్రజల సమస్యల్ని ఎప్పటికప్పుడే పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు గత ఏడునెలల నుంచి ఏలూరులో ప్రతీరోజు ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నానన్నారు.

## 'విద్యాదీవెన పథకంతో మోసగించిన జగన్'

ఏలూరుటూటౌన్, జనవరి31(ఆంధ్రజ్యోతి): ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పథకాన్ని విద్యాదీవెనగా మార్చి తల్లిదండ్రులు, విద్యార్థులను జగన్ దారుణంగా మోసం చేశాడని తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎన్ఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు మహేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమాశంలో ఆయన మాట్లాడారు. 2014-19లో టీడీపీ పాలనలో ప్రతీ ఏటా రూ.16 లక్షల మంది విద్యార్థులకు సీఎం చంద్రబాబునాయుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించారన్నారు. జగన్ పాలనలో ఏడాదికి 9 లక్షల మందికి విడతల వారీగా అందించి గొప్పలు చెప్పుకున్నాడని విమర్శించారు. కళాశాల యాజమాన్యం ఖాతాల్లో వేయకుండా తల్లిదండ్రుల ఖాతాల్లోకి వేస్తామని చెప్పి వేయకుండా మోసం చేశారన్నారు. ఈ మేరకు కొంతమంది విద్యార్థులు ఫీజులు కట్టలేక మధ్యలోనే చదువు ఆపేశారని అన్నారు. జగన్ విద్యాదీవెన బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఏ ముఖం పెట్టుకుని ఫీజుపోరు పేరుతో ఫిబ్రవరి 5న వైసీపీ కార్యక్రమాన్ని చేపడతారని ఎద్దేవా చేశారు. ఉమారెడ్డి మణికంఠ, మారం సూర్య, బీఎస్‌కే నాయుడు, పిలారిశెట్టి వింధ్యా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం : చింతమనేని

పెదవేగి, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : అర్హత గల ప్రతి ఒక్కరికీ సామాజిక పింఛన్లను అందిస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం దుగ్గిరాలలోని కార్యాలయంలో పలువురు ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా పింఛన్ల పంపిణీలో రాజకీయాలను జతచేయమన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థి అర్హుడా, కాదా అనేది మాత్రమే ప్రామాణికంగా చూస్తామన్నారు. పేదల వైద్యానికి సంబంధించి, ఎన్టీఆర్ వైద్యసేవతోపాటు అదనంగా సీఎం సహాయ నిధి ద్వారా నిధులు అందించే ఏర్పాటు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి పేదవానికి ఇంటిస్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి అనువుగా నిధులు అందిస్తామన్నారు.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రభాకర్

## ఏజెన్సీ ప్రాంత భూసమస్యలను పరిష్కరించాలి

ఏలూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో భూసమస్యలను పరిష్కరించాలని బుట్టాయిగూడెం గ్రామంలో గిరిజనులు వేసుకున్న గుడిసెలను తొలగించిన ప్రైవేట్ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ బృందం కోరింది. రెవెన్యూ అధికారులు తప్పుడు ప్రొటక్షన్ ఆర్డర్లను రద్దుచేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా జేసీ ధాత్రిరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి, సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, డి.ఎన్.వి.డి ప్రసాద్ మాట్లాడారు. ఏజెన్సీలోని పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో గిరిజనుల సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల వైఖరి వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూస్వాములకు అనుకూలంగా రెవెన్యూ అధికారులు ప్రొటక్షన్ ఆర్డర్లు ఇస్తున్నారని తెలిపారు. గిరిజనులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. జేసీ స్పందిస్తూ సమగ్రపరిశీలన చేసి ఆయా తహసీల్దార్‌తో చర్చిస్తానని హామీ ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు.

## బాలోత్సవంలో శనివారపుపేట ఉర్దూ విద్యార్థుల ప్రతిభ

ఏలూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన హేలాపురి బాలోత్సవంలో శనివారపుపేట ఉర్దూ స్కూల్లోని విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. బెస్ట్ ఫ్రమ్ వేస్ట్, పద్య విభాగం, భావం తదితర పోటీల్లో బహుమతులు అందుకున్నారని పాఠశాల హెచ్‌ఎం వహిదాబేగం తెలిపారు. శుక్రవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించి విద్యార్థులను అభినందించారు. ఎస్ఎంసీ ఛైర్మన్ కె.బేగం, గ్రామపెద్ద డాక్టర్ కాలేషా విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలి

ఏలూరుకార్పొరేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించి తక్షణమే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి ప్రకటించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. స్థానిక స్ఫూర్తి భవనంలో జరిగిన సమావేశంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. 26 జిల్లాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అమరావతి రాజధానిని ఫ్రీ జోన్‌గా చేయాలని కోరారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, మాజీ ఏఐవైఎఫ్ నాయకులు భజంత్రి శ్రీనివాస్, కమిటీ సభ్యులు ప్రసాద్, ప్రసన్నకుమార్, తాళ్ళూరి నాగరాజు, కృష్ణ, శేఖర్, అంబేడ్కర్, శివకుమార్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

## హోటళ్లలో విజిలెన్సు తనిఖీలు

ఏలూరు క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలోని నవయుగ రెస్టారెంట్, మెస్సర్స్ తనిష్క ఫుడ్ అండ్ బేవరేజస్ (క్రిగో) రెస్టారెంట్‌లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, రంగులు కలిపిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరాంబాబుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు విజిలెన్సు ఇన్‌స్పెక్టర్స్ పి.శివరామకృష్ణ, డి.ప్రసాద్‌కుమార్, ఎస్ఐ కె.సీతారామ్, సీహెచ్ రంజిత్‌కుమార్, ఆహార తనిఖీ అధికారులు కె.రామరాజు, డీవీ కావ్యారెడ్డి, వారి సిబ్బందితో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఆ హోటళ్లలోని చికెన్ ఫ్రై, క్యాబేజీ ఫ్రైలలో కృత్రిమ రంగులను కలిపినట్టు గుర్తించారు. వీటిని ల్యాబ్ పరీక్షలు నిమిత్తం పంపించారు. అపరిశుభ్రంగా హోటళ్ళు ఉండడంతో వారికి హెచ్చరికలు జారీ చేశారు.

## ఘనంగా గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ

బుట్టాయగూడెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అచ్చియ్యపాలెంలో శుక్రవారం గంగానమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. అమ్మవారితోపాటు పోతురాజు, సుబ్రహ్మణ్యస్వామి, వినాయకుని విగ్రహాలను ప్రతిష్ఠించారు. కేఆర్‌పురం ఐటీడీఏ నూతన ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విడుదల చేయగా నూతన ఆలయాన్ని నిర్మించి గ్రామస్థులు భక్తుల సహకారంతో విగ్రహాలను ప్రతిష్ఠించారు. అమ్మవారి విగ్రహాన్ని వంకాయల సత్యన్నారాయణమూర్తి దంపతులు, పోతురాజు విగ్రహాన్ని తెల్లం పెంటయ్య, వినాయకుడి విగ్రహాన్ని కొమరం విష్ణుకుమార్, మకర తోరణం వెత్స చిట్టిబాబు, భువనగిరి ప్రదీప్‌కుమార్, గంటను లీలారాణి బహూకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

# పెన్షన్.. టెన్షన్

- దొంగ సదరం సర్టిఫికెట్‌లతో చాలామందికి దివ్యాంగ పింఛన్
- వైద్యాధికారుల పునఃపరిశీలన

ఏలూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అర్హత లేకుండా దివ్యాంగుల పింఛన్ పొందుతున్న వారిలో గుబులు రేగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ నాయకుల అండదండలతో ఏ లోపం లేకపోయినప్పటికి దివ్యాంగులుగా సదరం దొంగ సర్టిఫికెట్లు చేయించుకుని సర్కార్ ఖజానాకు చిల్లు పెడుతున్నవారంతా ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. అర్హత లేకుండా తీసుకుంటున్న పింఛన్‌లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన సదరం సర్టిఫికెట్లను రీవెరిఫికేషన్ చేసి అర్హత కలిగిన వారిని ఉంచి అనర్హుల సదరం సర్టిఫికెట్లు తొలగించేందుకు ప్రత్యేకంగా విచారణ ప్రారంభించారు. ఉన్న పింఛన్ పోకుండా గత వైసీపీ నాయకుల ద్వారా సర్టిఫికెట్ చేయించుకుని పింఛన్ పొందుతున్న వారంతా ప్రస్తుతం అధికారపార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుతం ఏలూరు రూరల్ మండలంలో సుమారు 600 మంది దివ్యాంగ పింఛన్‌లు పొందుతున్నారు. ప్రస్తుతం కంటికి సంబంధించి 40 మంది దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లను వైద్య అధికారులు పరిశీలిస్తున్నారు. మెడికల్ పింఛన్ లబ్ధిదారులను వైద్యులు పరిశీలిస్తున్నారు.



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న వైద్య బృందం





ఏలూరు రామకోటిలో భక్తుల సామూహిక పూజలు.. ధర్మాజీగూడెంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

# ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినం

ద్వారకాతిరుమల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి విశిష్టత ఎంతో ప్రశస్తమైనదని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. వాసవీమాత ఆత్మార్పణ దినం పురస్కరించుకుని శుక్రవారం ద్వారకాతిరుమల క్షేత్ర వాసవీమాత ఆలయాన్ని ఆయన సందర్శించి, ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు నియోజకవర్గ వాణిజ్యవిభాగ అధ్యక్షుడు ఇమ్మడి రత్నాజీ, ఇతర ఆర్యవైశ్యులు ఘనస్వాగతం పలికారు.

• ఏలూరుకార్పొరేషన్/ఏలూరు : ఏలూరు రామకోటి ప్రాంగణంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆరాధనోత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకుని పూజలు, అభిషేకాలు, హోమా లు నిర్వహించారు. ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ మెంబర్ ఎస్ఎంఆర్ పెదబాబును ఆరాధనోత్సవ కమిటీ నాయకులు చలువాది పవనకుమార్, కె.కె.గుప్తా, దివ్వెల జయబాబు మిత్ర బృందం దుశ్శాలువాతో సత్కరించారు. కమిటీ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. పోలవరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు, సభ్యులు వాసవీమాత చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించారు.

• చింతలపూడి/లింగపాలెం : చింతలపూడి వీకేఎం ఫంక్షన్ హాలులో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొని వాసవీ మాతకు పూజలు జరిపారు. ఆర్యవైశ్య నాయకులు జల్లిపల్లి శివాజి ఎమ్మెల్యేను కలిసి అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థలం ఇవ్వాలని అభ్యర్థించారు. లింగపాలెం మండలం లింగపాలెం, ధర్మాజీగూడెం గ్రామాల్లోని స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రోషన్ కుమార్ హాజరై పూజలు చేశారు.



సీఎంను సత్కరిస్తున్న అంబికా కృష్ణ

## సీఎం చంద్రబాబుకు సత్కారం

ఏలూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజు పురస్కరించుకుని శుక్రవారం పెనుగొండ విచ్చేసిన సీఎం చంద్రబాబునాయుడుకు మాజీ ఎమ్మెల్సీ బీజేపీ సీనియర్ నాయకుడు అంబికా కృష్ణ సత్కరించారు. అమ్మవారి ఆత్మార్పణ రోజును అధికారికంగా నిర్వహించాలని, ఎన్నికల ముందు ఆర్య వైశ్యసంఘాలు కోరారు. ఈ మేరకు కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో హామీ మేరకు తాజాగా అమలుచేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షం వ్యక్తం చేశారు.

## 4,5న గ్రామసభలు

కుక్కునూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు, పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించే క్రమంలో ఫిబ్రవరి 4న వేలేరుపాడు, ఫిబ్రవరి 5న కుక్కునూరులో గ్రామసభలు నిర్వహించనున్నారు. ఐటీడీఏ పీవో కె.రాములునాయక్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. గ్రామసభలు నిర్వహించి వారి ఫిర్యాదులు సేకరించి వాటిని త్వరితగతిన పరిష్కరించనున్నారు. దీనిపై గ్రామ సభలు నిర్వహించడంపై గ్రామాల్లో ప్రచారం చేయించారని కుక్కునూరు, వేలేరుపాడు తహసీల్దార్‌లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

## 'అభయ-మీ భద్రత'పై అవగాహన

ద్వారకాతిరుమల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, మహిళలు, వృద్ధులకు పోలీసుల ఆపన్న హస్తం 'అభయ- మీ భద్రత మా బాధ్యత' అని మహిళా పోలీసులు తెలిపారు. ద్వారకాతిరుమల అంబేడ్కర్ గురుకులంలోను, పంగిడిగూడెం జడ్పీహెచ్ స్కూల్‌లోను చదువుతున్న బాలికలకు చిట్టి వెహికల్ అభయ ద్వారా ద్వారకాతిరుమల ఎస్ఐ టి.సుధీర్ నేతృత్వంలో బాల్యవివాహాల నిరోధక చట్టం, సైబర్‌క్రైమ్, 1930, చైల్డ్ హెల్ప్‌లైన్, 112, ఎపికె ఫైల్స్, లోన్‌యాప్, ఫ్రాడ్, డిజిటల్ అరెస్టు, హనీ ట్రాప్, చైల్డ్ అబ్యూస్, వంటి పలు అంశాలపై స్థానిక మహిళా కానిస్టేబుల్ పి.లక్ష్మీసుజన వివరించారు. ఏలూరు మహిళా పోలీస్ నాగలక్ష్మి, పంగిడిగూడెం సచివాలయ పోలీస్ నసీమ, ఉపాధ్యాయులు, పలువురు పాల్గొన్నారు.

## లారీ టైరు పేలి మంటలు

జీలుగుమిల్లి, జనవరి, 18: (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి లారీ టైర్ పేలి ప్రమాదవశాత్తు మంటలు సంభవించాయి. ఈ క్రమంలో నాల్గు రోడ్ల కూడలి జాతీయ రహదారిపై ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ పి.నవీన్‌కుమార్ మంటల్ని స్థానికుల సాయంతో అదుపు చేశారు. అనంతరం ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు గోతుల వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని రోడ్డు మరమ్మతు పనులు చేసి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.





రిటైర్డ్ పోలీసులను సన్మానిస్తున్న ఏఎస్పీ...రిటైర్డ్ హెచ్ఎం రమణరావు దంపతులకు సత్కారం

## పోలీస్ అధికారులకు ఉద్యోగ విరమణ సన్మానం

ఏలూరు క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలం పాటు ఏవిధమైన రిమార్కులు లేకుండా కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరి ఏఎస్ఐ, ఎస్ఐ వరకు పదోన్నతులు పొంది ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు జిల్లాలోని ఏలూరు సీసీఎస్ ఎస్ఐ ఏసీహెచ్ శేఖర్, ఏలూరు టూటౌన్ ఏఎస్ఐ డి.బ్రహ్మానందం, పెదవేగి ఏఎస్ఐ టీవీఎన్ మూర్తి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆ ముగ్గురికి ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సత్కరించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డులలో చుక్కా మోషే, ఎన్.ఏసుబాబు, వి.దేవదాసు, సీహెచ్‌వీ బ్రహ్మయ్య ఉద్యోగ విరమణ విరమణ సందర్భంగా సన్మానించారు. ఏఆర్‌ఆర్ఐ పవన్‌కుమార్, ఏలూరు జిల్లా పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, కార్యదర్శి రమేష్, హోంగార్డ్సు యూనిట్ ఇన్‌ఛార్జి ఆర్ఐ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఐసీడీఎస్ ఆర్జేడీ ఉద్యోగ విరమణ

ఏలూరు : మహిళా, శిశు సంక్షేమశాఖ ఏలూరు జోన్-2 ఆర్జేడీ వైశైలజ శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆమె ఆర్జేడీగా జనవరిలో పదోన్నతి పొంది ఏలూరు కార్యాలయంగా విధుల్లో చేరారు.

• ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన చెరుకూరి వెంకట రమణారావు దంపతులను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

## జిల్లాలో పారదర్శకంగా ఎరువులు సరఫరా చేశాం

ఏలూరుసిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ శాఖ కేటాయింపు ప్రకారం రైతులకు అవసరమైన ఎరువులను పారదర్శకంగా సరఫరా చేశామని ఏలూరు జిల్లా మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సీహెచ్ ప్రసాద్‌గుప్తా తెలిపారు. శుక్రవారం ఏలూరులో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కూడా ఎరువుల కొరత లేకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీసీఎంఎస్, రైతు సేవా కేంద్రాల ద్వారా ఇంతవరకు 30,262 మెట్రిక్ టన్నుల ఎరువులను సరఫరా చేశామన్నారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి, వ్యవసాయ శాఖ సిబ్బంది సమన్వయంతో ఎరువుల సరఫరా జిల్లాలో పారదర్శకంగా చేపట్టామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, విక్రయాలను సీఎంఏపీడీ యాప్ ద్వారా విక్రయాల సొమ్మును ఎప్పటికప్పుడు మార్క్‌ఫెడ్‌కు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కల్పించేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించిందన్నారు.

## పిల్లల్ని స్కూళ్లకు క్రమం తప్పకుండా పంపండి

ఏలూరు క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పిల్లలందరూ క్రమం తప్పకుండా పాఠశాలలకు రావాలని, బాగా చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని అధికారులు సూచించారు. అత్యంత వెనుకబడిన ప్రాంతం, సంచార జీవితం గడపటం, డంపింగ్ యార్డుకు వెళ్లి ఖాళీ సీసాలు, తుప్పు పట్టిన ఇనప వస్తువులు ఏరుకుంటూ మగ్గిపోతున్న వారికి అవగాహన కల్పించి వారి పిల్లలను పాఠశాలలో చేర్పించి క్రమం తప్పకుండా పంపించాలనే ఉద్దేశ్యంతో వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఏలూరు సమీపంలోని వైఎస్ఆర్ కాలనీకి శుక్రవారం వెళ్లారు. మొదటగా 17వ రోడ్, 18వ రోడ్లలో ఉన్న తల్లి దండ్రులను కలిసి వారి పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోరారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలకు చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ జి.నాగేశ్వరరావు, డీసీపీవో సూర్యచక్రవేణి తదితరులు పాల్గొన్నారు.





వైఎస్ఆర్ నగర్‌లో మాట్లాడుతున్న అధికారులు

## చింతలపూడిలో డ్రెయినేజీ రాళ్ల పంచాయితీ..

చింతలపూడి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీలో మెయిన్ రోడ్డుకు ఇరుపక్కలా ఆక్రమణలు తొలగించిన మునిసిపల్ అధికారులు డ్రెయినేజీల్లోని పూడిక తీత కార్యక్రమం చేపట్టారు. మూడు రోజులుగా పాతబస్టాండ్ నుంచి ఏరియా ఆస్పత్రి వరకు డ్రెయిన్లలోని పూడిక మట్టిని తొలగిస్తున్నారు. ఈ క్రమంలో ఆర్‌అండ్‌బీ శాఖ రోడ్డు విస్తరణ చేసినప్పుడు ఇరువైపులా డ్రెయినేజీలు నిర్మించి వాటిపై రాళ్లను అమర్చగా ఇప్పుడు ఆ రాళ్లను మునిసిపల్ అధికారులు తొలగించి ఓపెన్ డ్రెయిన్‌గా ఉంచాలంటూ రాళ్లను తీసి తరలిస్తున్నారు. దీంతో దుకాణదారులు ఓపెన్ డ్రెయిన్ వల్ల మురుగువాసనతో పాటు దోమలు వ్యాపించి పట్టణవాసులు అనారోగ్యం పాలవుతారని, డ్రెయిన్లలో పూడికతీసి తిరిగి రాళ్లను అమర్చాలని కోరినా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ ఎస్.సుందరరావు మాట్లాడుతూ లక్షలాది రూపాయలు వెచ్చించి ఆర్‌అండ్‌బీ డ్రెయిన్‌పై వేసిన రాళ్లను మునిసిపల్ అధికారులు తమకు చెప్పకుండా తొలగించడం సరికాదన్నారు. డ్రెయిన్లలో పూడిక తొలగించాలని మునిసిపల్ కమిషనర్ పావని దృష్టికి తీసుకెళ్లామన్నారు.



డ్రెయిన్ల పూడిక తీస్తున్న కార్మికులు

## ఇంటర్వ్యూ..

### రూ.42 కోట్ల 10 లక్షలు రుణాలు అందించాం

పులి సురేశ్‌కుమార్
వెలుగు శాఖ ఏపీఎం, దెందులూరు



• ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాల లక్ష్యం ఎంత?

జవాబు : మండలంలో రూ.72 కోట్ల లక్ష్యం ఉండగా ఇప్పటివరకు రూ.42 కోట్ల 10 లక్షలు అందించాం.

• ఎన్ని గ్రూపులకు రుణాలు ఇచ్చారు ?

జవాబు : మండలంలో 1,698 గ్రూపులు ఉండగా బ్యాంకు లింకేజీ గ్రూపులు 1,043 ఉన్నాయి. వాటిలో 617 గ్రూపులకు రుణాలు అందించాం.

• స్త్రీ నిధి పథకంలో రుణాలు ఇచ్చారా ?

జవాబు : మండలంలో స్త్రీ నిధి పథకంలో రూ.4 కోట్లకు లక్ష్యం ఉండగా ఇప్పటికే రూ.2 కోట్ల 3 లక్షలు ఇవ్వడం జరిగింది

• ఉమెన్ లీడ్ పథకం లక్ష్యమేమిటి ?

జవాబు : గ్రామీణా ప్రాంతాల్లో ఉన్న మహిళలు, గృహిణులు తమ కాళ్ల మీద స్వయం శక్తితో ఎదిగేందుకు చిరు వ్యాపారాలు చేసుకునేందుకు బ్యాంకు ద్వారా ఆర్థిక సహకారమే పథకం లక్ష్యం

• ఇప్పటివరకు ఎంత మందికి ఇచ్చారు ?

జవాబు : మండలంలో ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చిరు వ్యాపారులకు రూ.40 మందికి అందించాం.

• చంద్రన్న బీమా, ఇన్సూరెన్స్, పెళ్లి కానుక అమలులో ఉన్నాయా ?

జవాబు : గత ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేయలేదు. కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.. ప్రస్తుతానికి అమలులో లేవు

\- దెందులూరు

## కల్లుగీత దుకాణాల లైసెన్సులకు దరఖాస్తులు నిల్

ఏలూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కల్లుగీత కార్మికుల ఉపకులాలకు కేటాయించిన 14 మద్యం దుకాణాల లైసెన్సుల కోసం ఇప్పటివరకు ఒక్క దరఖాస్తు కూడా నమోదు కాలేదు. జనవరి 27న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయగా, ఫిబ్రవరి ఐదో తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు గడువు ఉంది. నాలుగు రోజుల నుంచి ఒక్క దరఖాస్తు రాలేదని అధికారులు చెప్పారు. గౌడ్, గౌడ, శెట్టిబలిజలకు సంబంధించి వారి కులం, నేటివిటీ సర్టిఫికెట్ల కోసం తిరుగుతున్నారు. సోమవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ పుంజుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.

## పాడి పశువుల పెంపకానికి ప్రోత్సాహకాలు

పెదవేగి, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : పాడి పశువుల పెంపకాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందని పెదవేగి మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.తారకేశ్వరరావు అన్నారు. బాపిరాజుగూడెంలో శుక్రవారం పెయ్య దూడల అందాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 52 దూడలను రైతులు ప్రదర్శనకు తీసుకొచ్చారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి రైతుకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. దూడల ఎదుగుదలకు అవసరమైన మందులను ఉచితంగా అందించారు. బాపిరాజుగూడెం పశువైద్యాధికారి ఎల్.రామకృష్ణ, సిబ్బంది వసంత, శ్రీరామ్మూర్తి, రైతులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక డీఈవో కార్యాలయం వద్ద ఏపీ విద్యాపరిరక్షణ కమిటీ నాయకులు ప్రదర్శన నిర్వహించారు. విద్యారంగంలో కేంద్రప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలపై సంఘ నాయకులు నిరసించారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్-1938, డీటీఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, తదితర ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు ఆదినారాయణ, పవన్, మోహన్, నాని తదితరులు పాల్గొన్నారు. డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ అవధానికి వినతిపత్రాన్ని అందజేశారు.

## త్రుటిలో తప్పిన ప్రమాదం

బుట్టాయగూడెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మర్లగూడెం సమీపంలో మొద్దుల లోడుతో వెళుతున్న ట్రాక్టరు రోడ్డుపై తిరగబడడంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పిం ది. శుక్రవారం బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వైపుగా వెళుతున్న మొద్దు ల లోడుతో ఉన్న ట్రాక్టరు అదుపుతప్పి మర్లగూడెం సమీపంలో రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. మొద్దులను లోడుచేసిన ఐదుగురు కూలీలు ట్రాక్టరు ఇంజన్‌పై కూర్చోవడంతో పెనుప్రమాదం తప్పినట్టయింది.

## శతాధిక వృద్ధురాలు రంగమ్మ మృతి

దెందులూరు,జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు యందంవారి పేటకు చెందిన శతాధిక వృద్ధురాలు మాదే రంగమ్మ(105) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు, ఆమెకు ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు, వారం క్రితం జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో పాల్గొని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కోవాలని ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రంగమ్మ (ఫైల్)


పూడికపోయిన తుమ్మిడి-చెన్నూరు మేజర్ డ్రెయిన్

# సంక్షోభంలో వరిసాగు

## ఓవైపు ప్రకృతి వైపరీత్యాలు..మరోవైపు అధ్వానంగా పంట కాల్వలు

ముదినేపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగం సంక్షోబాన్ని ఎదుర్కొంటోంది. ప్రకృతి వైపరీత్యాలు వరి సాగును దెబ్బకొట్టి రైతులను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి. ఖరీఫ్ సాగు ఏటా ఒడిదుడుకుల మధ్య సాగడం, రెండో పంట లేకపోవడంతో వారి ఆర్థిక పరిస్థితి దిగజారుతోంది. పెట్టుబడులు పెరగడం, ధాన్యానికి సరైన మద్దతు ధర లభించక రైతులు తమ భూములను కౌలు దారులకు లీజుకు ఇచ్చేస్తున్నారు. చాలామంది నల్లరేగడి భూములను చేపలు, రొయ్యల చెరువులకు లీజుకు ఇస్తున్నారు. తూర్పు కృష్ణ డెల్టాలో ఇరిగేషన్, డ్రెయినేజీ వ్యవస్థల పరిస్థితి అధ్వానంగా ఉండడంతో వరిసాగు దయనీయంగా మారింది. తూర్పు డెల్టాలో పోల్‌రాజ్ కెనాల్ పరిధిలో 54 వేల ఎకరాలు, క్యాంపుబెల్ కెనాల్ పరిధిలో 72 వేలు, బంటుమిల్లి కెనాల్ పరిధిలో 86 వేలు, ఏలూరు కెనాల్ పరిధిలో లక్షా 25 వేల ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు జరగాల్సి ఉండగా డ్రెయినేజీ వ్యవస్థ అనుకూలంగా లేక 50 శాతం భూములు చేపలు, రొయ్యల చెరువులుగా మారిపోయాయి.

### ఉపకరించని డ్రెయినేజీ వ్యవస్థ

మేజర్ డ్రెయిన్లతో పాటు మీడియం, మైనర్ డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడు, కిక్కిస నిండిపోయి భారీ వర్షాలు సమయంలో ముంపునీటిని సకాలంలో తగ్గించేందుకు ఉపకరించడం లేదు. పోల్‌రాజ్, పెదలంక, పెదకొమ్మిలేరు, చిన కొమ్మిలేరు, తుమ్మిడి, చెన్నూరు మేజర్ డ్రెయిన్లతో పాటు, పలు మీడియం డ్రెయిన్లు చాలా ఏళ్లుగా తవ్వకాలకు నోచుకోకపోవడం రైతులకు శాపంగా మారింది.

### ఐదేళ్లుగా మరింత అధ్వానం

తూర్పు కృష్ణాడెల్టాలో ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఇరిగేషన్, డ్రెయినేజీ వ్యవస్థలను పూర్తిగా గాలికి వదిలేసింది. పంట కాల్వలు, మురుగు కాల్వల్లో పూడికలను తొలగించడం, నీటి ప్రవాహానికి ఏర్పడిన ఆటంకాలను నివారించే పనులను చేపట్టేందుకు నిధులు మంజూరు చేయకపోవడంతో డ్రెయినేజీ, ఇరిగేషన్ శాఖ అధికారులు పనులు చేయలేమని చేతులు ఎత్తేశారు. ఈ కారణంగా పూడికలు పెరిగిపోవడమే కాక కిక్కిసతో దట్టంగా అలుముకుపోయాయి.

### సక్రమంగా దక్కని పంట



సార్వా వరి సాగు ఒడిదుడుకులతో కూడుకుంది. పంట కాల్వలు, మురుగు కాల్వలు పూడిపోవడం, వాటి నిర్వహణ లోప భూయిష్టంగా ఉండడంతో వరి పంట తుఫాన్‌లకు ముంపునకు గురై చేతికి సక్రమంగా దక్కడం లేదు. రెండేళ్లుగా వరుసగా పంటలు పోయాయి.

**- సోమా మోహనరావు, రైతు ముదినేపల్లి**

### తుఫాన్‌లతో తీవ్ర నష్టం



తరచూ సంభవిస్తున్న తుఫానులు వరి సాగుకు ప్రతిబంధకంగా మారాయి. సార్వా సీజన్‌లో నాట్లు వేశాక, వరి కోతలు ప్రారం భమయ్యే సమయంలో భారీ వర్షాలు కురియ డం రైతులకు శాపంలా మారాయి. డ్రెయిన్లు తవ్వించాలి, సీజన్‌కు ముందు డ్రెయిన్లలో డెక్క, కిక్కిస తొలగించాలి.

**- బండారు పాండు, రైతు, ఉప్పరగూడెం**

# ‘వీధి బాలలంతా విద్యనభ్యసించాలి’

కైకలూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పద్నాలుగు ఏళ్ల లోపు వయస్సు పిల్లలంతా పాఠశాలల్లోనే విద్యను అభ్యసించాలని కైకలూరు సీనియర్ సివిల్‌జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మీ అన్నారు. శుక్రవారం వీధి బాలల దినోత్సవం సందర్భంగా మండల లీగల్‌సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఆచవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ వీధి బాలలు విద్యను అభ్యసించేలా ఆయా గ్రామాల్లో యువత చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికకు రాజకీయ పార్టీలు సహకరించాలి


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

నూజివీడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ కోరారు. కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక 2025 సన్నాహకాలపై ఆయన వివిధ రాజకీయపక్షాల నాయకులతో సమావేశమయ్యారు. ఈనెల 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఔత్సాహిక అభ్యర్థులు ఫిబ్రవరి 10లోపు నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ అన్నారు. 27న పోలింగ్, మార్చి 3న ఓట్లలెక్కింపు జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజాప్రతినిధులు, డివిజన్ పరిధిలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయవద్దని సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసేవి ధంగా వ్యవహరించకూడదని, ఎన్నికల నిబంధ నలను తప్పకుండా పాటించాలని సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ముసునూరు రాజా, జనసేన నాయకులు ముత్యాల కామేష్, సీపీఎం కార్యదర్శి జి.రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షులు బోనుఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ కోడ్ నిబంధనలు పాటించాలి

ముసునూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ - తూర్పు గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనలకు పాటించాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. ముసునూరు జడ్పీపాఠశాలలో 80, 80ఏ పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్, కరెంట్, మంచినీరు, మరుగుదొడ్లు, సామగ్రి తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యాక్రమంలో వీఆర్వో మస్తాన్‌రావు పాల్గొన్నారు.

# కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి జాతరకు రాట ప్రతిష్ఠ


కొల్లేటికోటలో రాట ప్రతిష్ఠ చేస్తున్న భక్తులు

కైకలూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కొల్లేటి కోట పెద్దింటి అమ్మవారి జాతర నిర్వహించేందుకు రాట ప్రతిష్ఠా కార్యక్రమాన్ని వైభవంగా ప్రారంభించారు. శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య రాట ప్రతిష్ఠను ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ చేశారు. మార్చి 1వ తేదీ నుంచి 13 వరకు జాతర నిర్వహిస్తారు. పందిరిపల్లిగూడెం సర్పంచ్ బలే వెంకటరమణ, ఎంపీటీసీ బలే నాగమణి, తదితరులు పాల్గొన్నారు.


ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా తీసుకుంటున్న ఆవులు

# పొంచివున్న ప్రమాదం

నూజివీడు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఆవులు ఆరగిస్తున్నాయి. నూజివీడు బాలికోన్నత పాఠశాల వద్ద చెత్త డంప్‌చేసిన ప్రదేశం ట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలో ఉండడంతో ఆవులకు రెండు రకాలుగా ప్రమాదం పొంచి ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల, మరోవైపు విద్యుత్‌ఘాతం వల్ల ఏదైనా జరగవచ్చు.

## సారా విక్రయదారుడు అరెస్ట్

ముసునూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుచర్లలో సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. ఇస్లావతు రామును అదుపులోకి తీసుకుని 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. నిందుతుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా జడ్జి నిందుతుడికి రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ కేఎండీ ఆరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

### పోతనపల్లిలో 10 లీటర్లు సారా స్వాధీనం

చాట్రాయి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లి చిన్నతండాలో శుక్రవారం ఎక్సైజ్ దాడుల్లో పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. బాణావతు బాలును అదుపులోకి తీసుకొన్నట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. 50 లీటర్లు బెల్లం ఊటను కూడా ధ్వం సం చేశామన్నారు. ఈదాడిలో ఎక్సైజ్ ఎస్సైలు ఈశ్వరరావు, ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

# విగ్రహాలకు ముసుగులు


ముదినేపల్లిలో టీడీపీ హోర్డింగును తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ముదినేపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లా పట్టభద్రుల శాసనమండలి సభ్యుడి ఎన్నికకు నోటిఫికేషన్ ఉత్తర్వులు జారీ కావడంతో శుక్రవారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో ముదినేపల్లి మండలంలో కోడ్ అమలులో భాగంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయటంతోపాటు, రోడ్ల వెంబడి వివిధ పార్టీల నాయకుల ఫొటోలతో ఉన్న హోర్డింగులను అధికారులు తొలగించారు. తహసీల్దార్ సుభానీ ఆధ్వర్యంలో పంచాయతీల కార్యదర్శులు, వీఆర్వోలు, ఇతర సిబ్బంది మండలంలోని ముదినేపల్లి, వడాలి, సింగరాయపాలెం, విశ్వనాద్రిపాలెం, కొత్తపల్లి, గురజ, పెదపాలపర్రు, పెయ్యేరు తదితర గ్రామాల్లోని అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, హోర్డింగులను తొలగించారు. కొన్ని గ్రామాల్లో ఉన్న ఎన్టీఆర్, వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు ముసుగులు వేశారు.


పెదపాలపర్రులో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు


కలిదిండిలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

## పోలింగ్ స్టేషన్ల పరిశీలన

కలిదిండి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 16, 17 పోలింగ్ స్టేషన్లను తహసీల్దార్ రామకృష్ణ రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కలిదిండి మండలంలో మొత్తం 2 వేల లోపు ఓటర్లు ఉండటంతో వెయ్యి ఓట్లకు ఒక పోలింగ్ స్టేషన్ చొప్పున రెండు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో ఓటర్లంతా కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 16,17 పోలింగ్ స్టేషన్లలో ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ షమీ, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

### కుష్ఠు నివారణపై అవగాహన

ముదినేపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు నివారణపై మండలంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ముదినేపల్లి, గురజ, దేవపూడి పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులు ఇళ్లకు వెళ్లి శరీరంపై బొబ్బలు, మచ్చలు, ఉన్న వారిని పరీక్షించారు.


### పురుగు మందులు అందజేత

మండవల్లి జనవరి 31(ఆంధ్రజ్యోతి): రైతులు మినుము పంటపై తామర పురుగులను సకాలంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వెంకటమణి పేర్కొన్నారు. పెరికేగూడెంలో 50శాతం రాయితీతో పురుగు మందులను అందజేశారు.


దగ్ధమవుతున్న వరి గడ్డి

### సూరంపాలెంలో గడ్డి దగ్ధం

చాట్రాయి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ శివారు సూరంపాలెం గౌడబజారులో నాగుల కృష్ణకు చెందిన 8 ఎకరాల వరిగడ్డి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. నూజివీడు నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేశారు. కాలిపోయిన గడ్డి విలువ సుమారు రూ 80 వేలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.


హనుమాన్ వాహనంపై దర్శనమిచ్చిన శోభనాచలస్వామి

## శోభనాచల స్వామి రథసప్తమి ఉత్సవాలు

ఆగిరిపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంత కృష్ణశాంతి కల్యాణం నిర్వహించారు. రాత్రి 9 గంటలకు శ్రీ శోభనాచలస్వామి హనుమంత వాహనంపై కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చి గౌడసంఘం ఆధ్వర్యంలో నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

### చిరుద్యోగికి ఘన సత్కారం

ముదినేపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయ నాల్గవ తరగతి ఉద్యోగి కోడూరు వీర దుర్గా ప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆ కార్యాలయ అధికారులు, సిబ్బంది సత్కరించారు. ఎంపీడీవో రామకృష్ణ, కార్యాలయ ఏవో రమణా రావు, కృష్ణా జిల్లా పరిషత్ కార్యా లయ సూపరింటెండెంట్ రమణ రావు, ఈవోపీఆర్డీ అశోక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణారావు తదితరులు దుర్గా ప్రసాద్ దంపతులను సన్మానించి అభినందించారు.

# ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినం


ముదినేపల్లిలో వాసవీ అమ్మవారికి కలశం, పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

ముదినేపల్లి/కలిదిండి/కైకలూరు/చాట్రాయి/ఆగిరిపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం ముదినేపల్లిలోని భక్తాంజనేయ స్వామి దేవస్థానం వద్ద అమ్మవారి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను వాసవీ సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శి వత్తుమిల్లి సత్య వర ప్రసాద్, వెంకట సుజాత దంపతులు నిర్వహించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పైడిమర్రి మాల్యాద్రి, అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు, కోశాధికారి కురిచేటి తిరుమల శ్రీనివాస్, సంఘ ప్రముఖులు పాల్గొన్నారు. సాయంత్రం వాసవీ అమ్మవారి పల్లకీ సేవ, జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు. కలిదిండిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యం లో వాసవి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు వూర శ్రీధర్, నీలి సుమన్, పలివెల ప్రకాశరావు, నీలి వెంకటేశ్వరరావు, ఎన్.మాధవి, పద్మావతి, భారతి, మాలతీ, అన సూయ, వెంకటలక్ష్మి, బాబ్జీ పాల్గొన్నారు. కైకలూరు వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు చొప్పర్ల మురళీ కృష్ణ, కొప్పర్తి గోపాలకృష్ణ, సమయమంతుల రాజా ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించి భక్తులకు ఉచిత ప్రసాదాన్ని అందజేశారు. చాట్రాయి మండలం చనుబండలో వైశ్యులు అమ్మవారి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. ముందుగా అపరభద్రాద్రి కోదండరామాలయంలో పూజలు నిర్వహించి మంగళవాయిద్యాలతో అమ్మవారి త్యాగాలను స్తుతిస్తూ గ్రామోత్సవం జరిపారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు నడిపల్లి కిశోర్, మాజీ అధ్యక్షుడు జల్లేపల్లి పరమేశ్వరరావు, ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు. ఆగిరిపల్లిలో ఆర్యవైశ్య సంఘం యువ జన సంఘం, మహిళా మండలి ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినం నిర్వహించారు. నూతన పంచలోహ వాసవీ మాత విగ్రహానికి సంప్రోక్షణ తదితర పూజలు నిర్వహించారు. 102 కలశాలతో గ్రామోత్సవం, 102 కలశాలతో అభిషేకం, పంచామృత ఫలాభిషేకం, కుంకు మ పూజ చేసి సారె సమర్పించారు. చలవాది వెంకటరత్నం, రుక్మిత్, శైలజకుమారి, తదితరులు పాల్గొన్నారు.


కైకలూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి


చనుబండలో వాసవీమాత చిత్రపటంలో ఊరేగింపు


చిరంజీవిని అభినందిస్తున్న ట్రిపుల్‌ఐటీ అధికారులు

# డీన్ ఆఫ్ అకడమిక్స్‌గా డాక్టర్ చిరంజీవి

నూజివీడు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డీన్ ఆఫ్ అకడమిక్స్‌గా సీఎస్‌ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ చిరంజీవి ఎన్నికయ్యారు. ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించిన రత్నాకర్ నిర్ణీత పదవీకాలం పూర్తి కావడంతో ఆయన స్థానంలో చిరంజీవిని ఎంపిక చేస్తూ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ నిర్ణయం తీసుకున్నారు. ఏవో లక్ష్మణ్ తదితరులు చిరంజీవిని అభినందించారు.


ఇండస్ట్రియల్ విజిట్‌కు వెళుతున్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

## ఇండస్ట్రియల్ విజిట్‌కు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

నూజివీడు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ నూజివీడు, శ్రీకాకుళం క్యాంపస్ ఈసీఈ విభాగానికి చెందిన విద్యార్థులు మంగళగిరి ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా గురువారం సందర్శించేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా పరిశ్రమలో జరుగుతున్న అంశాలను విద్యార్థులు పరిశీలించి ప్రాజెక్టులను రూపొందించడం జరుగుతుందని డీన్‌లు శ్యామ్ తెలిపారు. శ్రీకాకుళం డిప్యూటీ ఏవో సతీష్, ఈసీఈ అధ్యాపకులు పాల్గొన్నారు.


సెయింట్ థామస్ పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

# వ్యాసరచన పోటీలు

నూజివీడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా నూజివీడు సెయింట్ థామస్ పాఠశాలలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. రహదారి భద్రతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో నూజివీడు ఎంవీఐ నాగమురళి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్వ్యూ..

### అపరాల సాగులో తెగుళ్లు నివారించాలి


వెంకటమణి, సబ్ డివిజన్ వ్యవసాయ అధికారి

- **అపరాల సాగులో తెగుళ్ల నివారణ చర్యలు ఏమిటి?**

జవాబు : ప్రస్తుతం ఎక్కువగా మినుము పంట సాగు చేశారు. ప్రధానంగా పల్లాకు తెగులు, తలమాడు తెగులు కాండం గజ్జి, తెగులు కనిపిస్తోంది.

- **నివారణకు ఏ మందు వాడాలి?**

జవాబు: ఎసిటమిప్రిడ్ లేదా ప్రొఫినోఫాస్ 0.2గ్రాములు మందు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఇసుక చౌడు భూముల్లో డొప్ప తెగులు ఎక్కువగా కనిపిస్తోంది. దీనికి మల్చీకే వాడుకోవడం మంచిది.

- **రైతులకు అందుతున్న యంత్ర పరికరాలు?**

జవాబు : టార్పాలిన్లు, ఆయిల్ ఇంజన్లు, బైవాన్స్ స్ప్రేయర్, ట్రాక్టర్ పనిముట్లను అందిస్తున్నాం. సంఘాలకు డ్రోన్లను అందిస్తున్నాం.

- **ఈ-క్రాప్‌తో ప్రయోజనం?**

జవాబు : ఈ-క్రాప్ నమోదుతోనే ప్రభుత్వం ద్వారా అందే ప్రతి పథకానికి రైతులు అర్హులవుతారు. పంట దిగుబడి తర్వాత వాటిని అమ్ముకోవడానికి, ప్రకృతి విపత్తులు జరిగనప్పుడు బీమా పరిహారం పొందేందుకు ఈక్రాప్ బుకింగ్ అవసరం.

- **‘పొలం పిలుస్తోంది’లో ఏ అంశాలు చర్చకు వస్తున్నాయి?**

జవాబు : ఎక్కువగా 50శాతం రాయితీతో జింకు, జిప్సం, తొలకరికి ముందే పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. పొలాలు పక్కనే ఉన్న డ్రెయిజీలను పూడిక తీయించాలని కోరుతున్నారు.

**- మండవల్లి**

## పాతకక్షలతో యువకుడిపై దాడి

ముదినేపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో గురజ గ్రామంలో ఓ యువకుడి పై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి తీవ్ర గాయాలకు గురిచేసిన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం ఆ గ్రామానికి చెందిన గుమ్మడి నాగ ఫణీంద్ర ఈనెల 29 సాయంత్రం తన ఇంటి వద్ద ఉండగా అటుగా వెళ్తున్న దగాని వెంకటేశ్వరరావు ఫణీంద్రతో వివాదానికి దిగాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగుతుండగా అక్కడికి వచ్చిన భాస్కరరావు, సురేంద్ర కర్రలతో దాడి చేశారు. ఫణీంద్రను గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదినేపల్లి ఎస్‌ఐ వీరభద్రరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మేకలకు నట్టల నివారణ మందు అందిస్తున్న ఏబీ వెంకటేశ్వరరావు

## ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

నూజివీడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉచిత పశుఆరోగ్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏ.బి వెంకటేశ్వరరావు సూచించారు. నూజివీడు మండలం ముక్కొల్లుపాడులో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన పరిశీలిం చారు. నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. 22 పశువులకు గర్భకోశ వ్యాధులకు మందులు ఇవ్వగా, 156 పెద్దపశువులకు 3,120 గొర్రెలు, మేకలకు నట్టలనివారణ మందులను అందించారు. పర్వతనేని సాయి, యనమదల పశువైద్య అధికారులు పాల్గొన్నారు.


ఎస్‌ఐ రామకృష్ణను సన్మానిస్తున్న మాల సంఘం నాయకులు

## ఎస్‌ఐ రామకృష్ణకు సన్మానం

చాట్రాయి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ కిశోర్ నుంచి ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్న ఎస్సై డి రామకృష్ణను శుక్రవారం మాల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నక్కా రాము, బుర్రి రమేష్, దారా రాజు, విజయరాజు, రత్తయ్య, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.